SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక




సంపుటి: 19 | సంచిక: 141 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 24 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



## పశ్చిమాసియా సంక్షోభం.. భారత్‌కు సవాళ్లు

- యుద్ధ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడే అవకాశం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- ఇంధన సరఫరా, నిల్వలపై కేంద్రం అప్రమత్తం
- లోక్‌సభలో ప్రధాని మోదీ

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. లోక్‌సభలో మాట్లాడిన ఆయన, మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు విసురుతోందని చెప్పారు. భారత్ ఇంధన అవసరాల్లో కీలక భాగం పశ్చిమాసియా నుంచే వస్తోందని, యుద్ధం ప్రభావం ప్రజల జీవనంపై కూడా పడుతోందని పేర్కొన్నారు. 4

## మోదీ రాజీపడ్డారు

### పార్లమెంటులో చర్చకు రావడం లేదు: రాహుల్




పశ్చిమాసియాలో పరిస్థితిపై నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని తన ప్రసంగంలో ఎక్కడా కూడా అమెరికా పేరును ప్రస్తావించ లేదని, నూటికి నూరు శాతం ఆయన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంట్రోల్‌లో ఉన్నారని విమర్శించారు. 4

# మూసీ ప్రక్షాళన.. సామాన్యుడికి భరోసా!

## ఎవరికీ నష్టం జరగదు.. సీఎం హామీ

మెరుగైన వసతులతో పునరావాసం ▪ కాలుష్య రహిత నగరమే లక్ష్యం

భాగ్యనగరానికి పూర్వవైభవం ▪ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల పరివాహక ప్రాంత ప్రజలెవరూ నిరాశ్రయులు కారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా వారందరికీ ప్రభుత్వం మెరుగైన వసతులతో కూడిన పునరావాసం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మూసీ ప్రజలను ఆదుకునే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వాటిని తప్పనిసరిగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతను ఈ సందర్భంగా ఆయన సభ ముందు ఉంచారు.

మిగతా 2 లో




## బడ్జెట్‌లో కోతలు.. రైతులకు వాతలు!

- హామీల అమలు ఎక్కడ?
- రైతులకు కాంగ్రెస్ దగా
- హరీశ్‌రావు ధ్వజం
- ఆదాయం పెంపుపై నిలదీత!

2

## గ్యారంటీలకు చట్టబద్ధత.. బీఆర్ఎస్ పట్టు

అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు నోటీసు 2



# డిజిటల్ వోచర్లతో ప్రచారం

- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిర్ణయం
- దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో పార్టీలకు ఉచిత ప్రసార సమయం
- ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ టైమ్ వోచర్లు జారీ

భారత ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కేటాయించేందుకు డిజిటల్ వోచర్ల విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు ప్రకటించింది. ఈ ఉచిత ప్రసార అవకాశం దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. త్వరలో జరగనున్న అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. 4



## భారీగా తగ్గిన బంగారం ధరలు

యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు 4




## 10 కేజీల ఎల్పీజీ సిలిండర్లపై కేంద్రం స్పష్టత

ఆ వార్తలు ఊహాగానాలేనని వివరణ ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి నిర్ణయం లేదు ప్రస్తుతం 14.2 కేజీల సిలిండర్లే కొనసాగింపు

.. వివరాలు 4లో



## మెట్రో మ్యాజిక్ హైదరాబాద్‌కు మహర్దశ!

రూ. 24 వేల కోట్లతో రెండో దశ.. రన్‌వే కింద అండర్ టన్నెల్

ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో అనుసంధానం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2

## మచిలీపట్నం కోర్టుకు బాంబు బెదిరింపు

ఈ-మెయిల్ ద్వారా జిల్లా జడ్జికి హెచ్చరిక

కోర్టు పరిసరాల్లో పోలీసులు తనిఖీలు

భద్రతా కారణాల వల్ల ప్రవేశం నిలిపివేత



కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు జిల్లా జడ్జికి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించారు. 5

# ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్ ఇది



- ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు..స్పీడ్ ఆఫ్ డూయింగ్
- ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు
- ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

**అనకాపల్లి, మార్చి 23:** ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయ-బోతున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది.

మిగతా 5 లో

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

### ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 23:** రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాం.. ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వ న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## గ్యారంటీలకు చట్టబద్ధత.. బీఆర్ఎస్ పట్టు

### అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు నోటీసు

**హైదరాబాద్, మార్చి 23:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మాణిక్ రావు, దాసోజు శ్రవణ్‌కుమార్, శంభీపూర్ రాజు, మాధవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

# బడ్జెట్‌లో కోతలు.. రైతులకు వాతలు!

- హామీల అమలు ఎక్కడ?
- రైతులకు కాంగ్రెస్ దగా
- హరీశ్‌రావు ధ్వజం
- ఆదాయం పెంపుపై నిలదీత.... !



**హైదరాబాద్, మార్చి 23:** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి 15 వేల రూపాయలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని మండిపడ్డారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడుతూ ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు.

### రైతుబంధుపై నిలదీత

మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని ఆరోపించారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని రెండు బడ్జెట్‌లలో పెట్టినా ఒక్కసారి కూడా ఇవ్వలేదని తప్పుబట్టారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పి ఇప్పుడు ఆ ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు.

### కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు

అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఆపకుండా రైతుబంధు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గొట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎకరానికి 15 వేల రూపాయల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. తొలి బడ్జెట్‌లో ప్రకటించి ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### హామీల ఉల్లంఘన

గతంలో తమ ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒకే పంటకు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టిన అంశాలను కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయాల్లోనే రైతులకు వరాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. రెండు బడ్జెట్లలో ఉన్న పంటల బీమా పథకం ఈ బడ్జెట్‌లో మాయం కావడాన్ని ఆయన ప్రశ్నించారు.

### మాయమైన పథకాలు

రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా అమల్లోకి రాలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన ఈ బడ్జెట్‌లో లేకపోవడాన్ని తప్పుబట్టారు. అలాగే ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా 12 వేల కోట్ల రూపాయలు పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న అబ్కారీ ఆదాయాన్ని 46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని నిలదీశారు. ఇందుకోసం ఊరూరుకు బార్లు తెరుస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### ఆదాయం పెంపుపై నిలదీత

ఈ సమయంలో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో 12 వేల కోట్లుగా ఉన్న ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 36 వేల కోట్లు పెంచిందని చెప్పారు. జూపల్లి జోక్యం చేసుకోవడంపై హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని కోరారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, కేవలం ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అంశం కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు.

# పెన్షనర్ల వేదన.. బీఆర్ఎస్ వాకౌట్!

### బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

### అసెంబ్లీలో గళమెత్తిన విపక్ష సభ్యులు

**హైదరాబాద్, మార్చి 23:** ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా, కల్వకుంట్ల సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు 700 కోట్ల రూపాయల బకాయిలను చెల్లిస్తామని చెప్పి, ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

# మూసీ ప్రక్షాళన.. సామాన్యుడికి భరోసా!

## ఎవరికీ నష్టం జరగదు.. సీఎం హామీ

- మెరుగైన వసతులతో పునరావాసం
- కాలుష్య రహిత నగరమే లక్ష్యం
- భాగ్యనగరానికి పూర్వవైభవం



**హైదరాబాద్, మార్చి 23:** మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల పరివాహక ప్రాంత ప్రజలెవరూ నిరాశ్రయులు కారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా వారందరికీ ప్రభుత్వం మెరుగైన వసతులతో కూడిన పునరావాసం కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మూసీ ప్రజలను ఆదుకునే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వాటిని తప్పనిసరిగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతను ఈ సందర్భంగా ఆయన సభ ముందు ఉంచారు.

### మహానగరాల అనుభవాలు

దేశంలోని ఢిల్లీ ముంబై బెంగళూరు చెన్నై వంటి నగరాల్లో తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ముంబైలో వర్షాలు కురిస్తే నివసించలేని పరిస్థితి ఢిల్లీలో తీవ్రమైన కాలుష్యం బెంగళూరులో ట్రాఫిక్ ఇబ్బందులు చెన్నైలో నీటి ముంపు వంటి పరిస్థితులను మనం గమనించాలని సూచించారు. నల్గొండ ప్రజల కష్టాలను వారి ఆవేదనను గమనించే వారెవరూ ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుకోరని ఆయన అన్నారు. సలహాలు తీసుకోవడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తామని ప్రకటించారు. ఏ రాష్ట్ర ప్రగతి అయినా ఆ రాష్ట్ర నగరాలు పెట్టుబడులు ప్రజల జీవన స్థితిగతులపై ఆధారపడి ఉంటాయని గుర్తు చేశారు.

### కాలుష్య రహిత కార్యాచరణ

తెలంగాణను క్యూర్ ప్యూర్ రేర్ అనే మూడు ప్రాంతాలుగా విభజించి సమగ్ర ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల నగరం కాలుష్య రహితంగా మారుతుందని హిల్ట్ పాలసీ ద్వారా ఇక్కడి భూములను మల్టీయూజ్ జోన్లలోకి మారుస్తున్నామని చెప్పారు. దీనివల్ల భూ యాజమాన్య హక్కులు మారకుండా మధ్య తరగతి నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. పరిశ్రమల తరలింపు ద్వారా నగరాన్ని సర్వీస్ సెక్టార్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కులీకుతుబ్ షాహీల కాలం నాటి చారిత్రాత్మక కట్టడాల వైభవాన్ని కాపాడుతూనే ఆధునిక సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు.

### గోదావరి నీటితో ప్రక్షాళన

గోదావరి నుంచి ఇరవై టీఎంసీల నీటిని తరలించి అందులో పదిహేడు టీఎంసీలను జంటనగరాల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన మూడు టీఎంసీల నీటిని మూసీ నదిలో నిరంతరం ప్రవహించేలా చూస్తామని దీనివల్ల మూసీ ప్రాజెక్టు నూతన రూపును సంతరించుకుంటుందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఒక పటిష్టమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుందని ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో అందరూ సహకరించాలని కోరారు. ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా పారదర్శకమైన పద్ధతిలో పునరావాస పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. మానవ తప్పిదాల వల్ల కలిగిన కాలుష్యాన్ని దూరం చేసి రేపటి తరానికి స్వచ్ఛమైన హైదరాబాద్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

# మెట్రో మ్యాజిక్.. హైదరాబాద్‌కు మహర్దశ!

- రూ. 24 వేల కోట్లతో రెండో దశ
- రన్‌వే కింద అండర్ టన్నెల్
- ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో అనుసంధానం
- ట్రాఫిక్ ఫ్రీ సిటీయే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 23:** హైదరాబాద్ నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి మెట్రో విస్తరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టడం వంటి బృహత్తరమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చి నగర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. శాసనమండలి సభ్యులు లేవనెత్తిన ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి మెట్రో రోడ్ల విస్తరణపై సమగ్రంగా వివరించారు. చివరి ప్రాంతం వరకు రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో రూ. 24 వేల కోట్లతో మెట్రో రెండో దశను 76 కిలోమీటర్ల మేర విస్తరించడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని పేర్కొన్నారు.

### మెట్రో రెండో దశ విస్తరణ

హైదరాబాద్ మెట్రో ప్రారంభమైనప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా గత దశాబ్దకాలం ఎలాంటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో తొమ్మిదో స్థానంలోకి పడిపోయామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి ఎక్కడి నుంచి అయితే ట్రాఫిక్ ప్రారంభమవుతుందో అటువంటి హయత్‌నగర్ రామచంద్రాపురం లాంటి ప్రాంతాలకు మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎల్బీనగర్ వద్ద ఆగిపోయిన మెట్రోను హయత్‌నగర్ వరకు పొడిగించడంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి నాగోల్ ఓవైసీ ఆసుపత్రి చాంద్రాయగుట్ట రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో కనెక్టివిటీ కల్పిస్తున్నామని వివరించారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉండే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నియోపోలిస్ వరకు కూడా మెట్రోను విస్తరించడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు.

### ఎలివేటెడ్ కారిడార్లు - అండర్ టన్నెల్


ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను మూడు రకాలుగా విభజించి అండర్ పాస్ సర్ఫేస్ రోడ్లు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉత్తర తెలంగాణ మార్గంలో బాటిల్ నెక్‌గా మారిన కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రక్షణ శాఖ నుంచి 153 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట విమానాశ్రయ రన్‌వే కింద నుంచి అండర్ టన్నెల్ నిర్మాణానికి అనుమతి తీసుకుని పనులు మొదలుపెట్టామని వెల్లడించారు. నల్గొండ వైపు వెళ్లే వారికి ఇబ్బందిగా మారిన జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూన్ లేదా జూలై నాటికి అందుబాటులోకి వస్తుందని ఆయన సభకు వివరించారు.

### పాదచారుల భద్రత - మూసీ ప్రక్షాళన

నగరంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడానికి ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి చెప్పారు. పార్కింగ్ సమస్యల పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ నాంపల్లి వంటి ప్రాంతాల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ వెంట గౌరవెల్లి వరకు సుమారు 43 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ కారిడార్ నిర్మాణం వల్ల నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్ సైబరాబాద్ మేడ్చల్ కార్పొరేషన్లతో పాటు నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## మృతుల కుటుంబాలకు 'కోటి' భరోసా

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగులు ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి రూపాయల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. అసెంబ్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచుతూ ఉద్యోగ కుటుంబాల్లో ధైర్యం నింపారు.



# రైతుభరోసా విడుదల

**సీఎంకు కృతజ్ఞతల వెల్లువ**

**హైదరాబాద్, మార్చి 23 :** తొలి విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభలోని సీఎం కార్యాలయంలో వీరు ముఖ్యమంత్రిని కలిసి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో రైతులకు సాయం అందజేయడం వల్ల వారికి ఊరట దక్కిందని అన్నారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని నిరూపితం అయ్యిందని పేర్కొన్నారు.

# మీ అప్పుల వడ్డీలకే సరిపోతోంది

**రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదే**

**రుణమాఫీ పేరుతో రైతులను వంచించారు**

**అసెంబ్లీలో బీఆర్ఎస్ తీరుపై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్, మార్చి 23:** అసెంబ్లీలో బడ్జెట్ చర్చలు వాడివేడిగా సాగాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఖజానా సరిపోతోందని ఆమె ధ్వజమెత్తారు.

**అప్పుల కుప్పగా తెలంగాణ**

పాండవులు సంపాదించింది కౌరవుల తద్దినానికే సరిపోయినట్లు.. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే మాకు సరిపోతోందంటూ ఆమె ఎద్దేవా చేశారు. హరీష్ రావు తన నియోజకవర్గంలోనే రైతులకు అప్పులు ఉన్నాయని చెబుతున్నారని, మరి ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉండి కూడా పదేళ్లలో ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారని ప్రశ్నించారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను వంచించిందని, ఇప్పుడు ఆరు నెలల తమ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు.

**నియామకాలు.. సంక్షేమ పథకాలు**

తెలంగాణ ఉద్యమమే నిధులు నియామకాల కోసం జరిగిందని గుర్తు చేసిన సీతక్క, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ గ్యారెంటీ ఇచ్చిందని నిలదీశారు. తాము అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ ఇందిరమ్మ ఇళ్లు నూతనంగా ప్రకటించిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

**అధికారం కోసమే ఆరాటం**

మీరు పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో లెక్క చెప్పండి.. మేము ఈ రెండేళ్లలో ఎన్ని ఇస్తామో చూపిస్తాం అని ఆమె సవాలు విసిరారు. హరీష్ రావు పడుతున్న బాధ అంతా అధికారం పోయిందనే తప్ప ప్రజల మీద ప్రేమతో కాదని వ్యాఖ్యానించారు. సీటు మారగానే చరిత్ర మారిపోదని, పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేయని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆమె సూచించారు.

# కీలక బిల్లులకు కేబినెట్ పచ్చజెండా!

**గిగ్ వర్కర్ల భద్రతకు ప్రత్యేక చట్టం**

**అడ్వకేట్ల రక్షణ బిల్లుకు ఆమోదం**

**మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం**

**రోహిత్ వేముల చట్టంపై సబ్ కమిటీ ఏర్పాటు**

**హైదరాబాద్, మార్చి 23:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 10 ప్రధాన అంశాలపై చర్చ జరగగా.. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమం, న్యాయవాదుల రక్షణ, మెట్రో స్వాధీనం వంటి విషయాలపై కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో సుమారు 3 నుంచి 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం చేకూరేలా 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు'ను ప్రభుత్వం రూపొందించింది. వీరికి సామాజిక భద్రతతో పాటు సంక్షేమ పథకాలు అందించేలా ఈ బిల్లులో ప్రతిపాదనలు ఉన్నాయి. దీనితో పాటు విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కోర్ అర్బన్ యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుపై కూడా సుదీర్ఘంగా చర్చించారు.

**న్యాయవాదుల రక్షణ.. మెట్రో స్వాధీనం**

న్యాయవాదుల భద్రత కోసం 'తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు'ను కేబినెట్ ఆమోదించింది. మరోవైపు ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ ఎం ఆర్ ఎల్ కు అప్పగించింది.

**కులగణన.. రోహిత్ వేముల చట్టం**

కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. అలాగే రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పన కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చైర్మన్‌గా మంత్రులు దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా సబ్ కమిటీని నియమిస్తూ తీర్మానం చేసింది.

# క్యూనెట్ ఘరానా మోసం

- 32 మంది కేటుగాళ్ల అరెస్ట్
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్
- బాధితుడి ఆత్మహత్యతో వెలుగులోకి..
- సీపీ సజ్జనార్ వెల్లడి!



**హైదరాబాద్, మార్చి 23 :** క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సోమవారం క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు.

**క్యూనెట్ సంస్థ నిర్వాహకుల పన్నాగం**

ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టార్గెట్ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ. 5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గాలం**

వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించుకున్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు.

**32 మంది నిందితుల అరెస్ట్**

నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 32 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నారని ప్రస్తావించారు. చాలామంది ఇండియన్ డైరెక్ట్ సెల్లెర్స్‌గా ఏర్పడి బిజినెస్ చేస్తున్నారని అన్నారు. డైరెక్ట్ ప్రోడక్ట్ సెల్లింగ్ పేరుతో మనీ స్కాంలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# అసెంబ్లీలో 'బియ్యం' పోరు..

**హరీష్ వర్సెస్ ఉత్తమ్!**

- ఎగుమతుల్లో కుంభకోణం జరిగిందన్న హరీష్ రావు
- హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ పట్టు
- అవన్నీ అసత్యాలేనని మండిపడ్డ మంత్రి ఉత్తమ్
- సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మాటల యుద్ధం



**హైదరాబాద్, మార్చి 23 :** తెలంగాణ శాసనసభ వేదికగా సోమవారం బియ్యం ఎగుమతుల వ్యవహారం సెగలు పుట్టించింది. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపే ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించగా.. అవన్నీ నిరాధారమైన వ్యాఖ్యలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొట్టిపారేశారు. ఈ క్రమంలో ఇద్దరు నేతల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం సాగడంతో సభలో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది.

**కుంభకోణంపై విచారణ జరపాలి: హరీష్ రావు**

ప్రశ్నోత్తరాల సమయంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయడంలో ప్రభుత్వం నిబంధనలు తుంగలో తొక్కిందని మండిపడ్డారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా ఎలా నియమించుకున్నారని నిలదీశారు. నాఫెడ్‌కు అవకాశం ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేటు సంస్థకు ఎందుకు కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టులో ఏడాది కాలంగా 7,500 టన్నుల బియ్యం ముక్కిపోతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై హౌస్ కమిటీ వేసి విచారణ జరపాలని, అందులో తనను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీష్ రావు గట్టిగా కోరారు.

**తప్పుడు ప్రచారం ఆపండి: మంత్రి ఉత్తమ్**



హరీష్ రావు ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విదేశాలకు బియ్యం ఎగుమతి చేసే విషయంలో నేరుగా ఫిలిప్పీన్స్ మంత్రితోనే ఒప్పందం చేసుకున్నామని స్పష్టం చేశారు. షిప్పింగ్ తో పాటు గోదాం ఛార్జీలన్నీ ఆ దేశమే భరిస్తోందని వివరించారు. ఏమీ తెలియకుండా స్కాం అంటూ అసత్య ప్రచారం చేయడం తగదని బీఆర్ఎస్ సభ్యులపై మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా రైతులకు మేలు చేస్తున్నామని, పండించిన ప్రతి గింజను కొంటున్నామని వెల్లడించారు. ప్రతిపక్షం సిఫారసు చేసిన వ్యక్తులకు బియ్యం ఇవ్వలేదనే అక్కసుతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారా అని హరీష్ రావును ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులకు మేలు జరుగుతుంటే ఓర్వలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సకాలంలో జీతాలు

**బకాయిల చెల్లింపునకు పక్కా ప్లాన్!**

**ఒకటో తేదీనే వేతనాలు.. మూడు డీఏలు కూడా చెల్లిస్తాం**

**బకాయిల భారం తప్పించుకునేందుకే గతంలో రిటైర్మెంట్ వయసు పెంపు**

**ప్రతి నెలా వెయ్యి కోట్లు చెల్లించేలా ప్రభుత్వ యోచన: భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, మార్చి 23:** ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే వేతనాలు అందేవని.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. గత పాలకులు పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏలను కూడా చెల్లిస్తామని అసెంబ్లీలో స్పష్టం చేశారు.

**పదవీ విరమణ వయసు పెంపు వెనుక అసలు గుట్టు**

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకే గత ప్రభుత్వం పదవీ విరమణ వయసును మూడు ఏళ్లు పెంచిందని విమర్శించారు. ఉద్యోగుల వయసును 58 నుండి 61 సంవత్సరాలకు.. నాలుగవ తరగతి సిబ్బందికి 60 నుండి 65 ఏళ్లకు పెంచడం వల్ల 17 వేల మంది పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రస్తుతం తమ ప్రభుత్వంపై పడిందని వివరించారు. ఇప్పటికే మెడికల్ బిల్లులన్నీ క్లియర్ చేశామని.. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నామని తెలిపారు.

**బకాయిల చెల్లింపునకు భారీ ప్రణాళిక**

గత ప్రభుత్వం మొత్తం 40,150 కోట్ల రూపాయల బకాయిలు వదిలి వెళ్లిందని.. ఇందులో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులే 4,575 కోట్లు ఉన్నాయని శ్వేత పత్రం ద్వారా వెల్లడించారు. ఈ బకాయిలను తీర్చేందుకు ప్రస్తుతం ప్రతి నెలా 700 కోట్లు చెల్లిస్తున్నామని.. దీనిని వెయ్యి కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. ప్రతి సమస్యనూ మానవీయ కోణంలో చూస్తామని.. ఉద్యోగుల బకాయిలన్నీ త్వరలోనే క్లియర్ చేస్తామని భరోసా ఇచ్చారు.

# కాంగ్రెస్ హామీలకు దిక్కులేదు

**అమలు కాని వాగ్దానాలు.. అవినీతి పాలన**


**అప్పుల లెక్కలపై ప్రభుత్వానికి నిలదీత**

**రైతు భరోసా ఎగ్గొట్టి రైతులను మోసం చేశారు**

**జడ్చర్ల, మార్చి 23 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కావడం లేదని బిఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళా భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు.

**మభ్యపెట్టే రాజకీయాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సగం రోజులు గడిచిపోయినా ఇచ్చిన హామీలు ఏమయ్యాయని లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. ఇంకెన్ని రోజులు ప్రజలను మభ్యపెడతారని నిలదీశారు. కాంగ్రెస్ సర్కార్ అత్యంత అవినీతిమయమైందని మంత్రుల మధ్య వాటా పంచాయితీలే జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజల సంక్షేమం అభివృద్ధిపై పట్టింపు లేదని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసిందని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెబుతుంటే.. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండు లక్షల ఎనభై వేల కోట్లు మాత్రమే అప్పు ఉందని కేంద్రం పార్లమెంటులో చెప్పిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కూడా పూర్తి కాకముందే ఇంత భారీగా అప్పు చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేసిన అప్పులు కడుతున్నామనేవి అవాస్తవాలని విమర్శించారు. భారీగా అప్పులు చేసినా ప్రాజెక్టులు సంక్షేమం హామీల అమలు ఎక్కడా కనిపించడం లేదన్నారు.రైతు భరోసా నిధులను మూడుసార్లు ఎగ్గొట్టి అన్నదాతలను వంచించారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. బడ్జెట్ లో కేవలం అంకెల గారడీతో అభివృద్ధి సాధ్యం కాదని హితవు పలికారు. పేపర్ లో అంకెలను అటు ఇటు మార్చినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఫలితాలు రావని స్పష్టం చేశారు.



సంపాదకీయం

# మృత్యుఘంటికలు

## నిర్లక్ష్యమే టీబీకి ఊపిరి.. భారత్‌లోనే అత్యధిక కేసులు

## నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

మానవ చరిత్రలో అత్యంత పురాతనమైన మరియు ప్రమాదకరమైన అంటు వ్యాధుల్లో క్షయ (ట్యూబర్‌క్యులోసిస్) ఒకటి. వైద్యశాస్త్రం అద్భుత ప్రగతి సాధించి, ప్రాణాంతక వ్యాధులను సైతం నియంత్రించగలుగుతున్న ఆధునిక యుగంలో కూడా 'క్షయ' మృత్యుఘంటికలు మోగిస్తూనే ఉండటం సభ్య సమాజానికి సవాలుగా మారింది. ఒకప్పుడు క్షయ సోకితే మరణం ఖాయమని భయపడేవారు. కానీ, నేడు సకాలంలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అత్యాధునిక మందులు, చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. అయినా సరే, క్షేత్రస్థాయి గణాంకాలు మాత్రం భిన్నమైన, భయంకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. నేటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు ఈ వ్యాధితో కన్నుమూస్తున్నారంటే, లోపం చికిత్సలో ఉందా లేక మన సామాజిక అవగాహనలో ఉందా అన్నది లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

### చారిత్రక నేపథ్యం - శాస్త్రీయ విజయం

1882 మార్చి 24న జర్మనీకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికి కారణమైన 'మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్' అనే సూక్ష్మక్రిమిని కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ వైద్య ప్రపంచంలో ఒక మైలురాయి. ఈ అద్భుత ఘట్టానికి వంద ఏళ్లు పూర్తయిన సందర్భంగా, 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్ చేసిన ప్రతిపాదన మేరకు ప్రతి ఏటా మార్చి 24ను 'ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం'గా పాటిస్తున్నాం. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు ప్రపంచవ్యాప్తంగా కృషి చేయడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. అయినప్పటికీ, డబ్ల్యూహెచ్‌ఓ (ఔనూ) గణాంకాల ప్రకారం ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు కేవలం ఎనిమిది దేశాల్లోనే ఉన్నాయి, ఇందులో దురదృష్టవశాత్తు భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

### నిర్లక్ష్యం: వ్యాధి కంటే ప్రమాదకరం

క్షయ అనేది కేవలం ఊపిరితిత్తులకే పరిమితమైన వ్యాధి కాదు. ఇది ప్రధానంగా శ్వాసకోశాన్ని దెబ్బతీసినప్పటికీ, చర్మం నుండి మెదడు వరకు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఏ భాగానికైనా సోకే అవకాశం ఉంది. రెండు వారాల కంటే ఎక్కువ కాలం ఎడతెరిపి లేని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం మరియు అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. కొంతమందిలో కఫంలో రక్తం పడటం, ఛాతి నొప్పి వంటి తీవ్రమైన సమస్యలు కనిపిస్తాయి. వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ బిందువుల ద్వారా ఇది ఒకరి నుండి మరొకరికి సులభంగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా పోషకాహార లోపం ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మరియు సిలికోసిస్ వంటి వృత్తిపరమైన అనారోగ్యాలతో బాధపడేవారికి ఈ వ్యాధి త్వరగా సోకుతుంది.

వైద్యులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రధాన అంశం 'రోగుల నిర్లక్ష్యం'. సాధారణంగా 6 నుండి 9 నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని 100 శాతం నయం చేయవచ్చు. కానీ, చాలామంది రోగులు రెండు మూడు నెలలు మందులు వాడగానే శరీరం పుంజుకోవడంతో వ్యాధి తగ్గిందని భావించి చికిత్సను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ఇది అత్యంత హానికరం. దీనివల్ల శరీరంలోని బాక్టీరియా మందులకు లొంగని 'మల్టీ డ్రగ్ రెసిస్టెంట్' (వీణ=-ుదీ) గా మారుతుంది. ఈ స్థితికి చేరుకున్న రోగికి చికిత్స చేయడం అత్యంత క్లిష్టతరం కావడమే కాకుండా ప్రాణాపాయం కూడా ఎక్కువే. 2016లో సుమారు 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకడం, అందులో 2.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం వెనుక ఇటువంటి అసంపూర్ణ చికిత్సలే ప్రధాన కారణమని తెలుస్తోంది.

### సామాజిక బాధ్యత - ప్రభుత్వ చొరవ

భారత ప్రభుత్వం 1962 నుండే క్షయ నివారణకు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించింది. ప్రస్తుతం 'క్షయ ముక్త భారత్' లక్ష్యంతో ప్రభుత్వం రోగులకు ఉచిత పరీక్షలు, మందులతో పాటు 'నిక్షయ్ పోషణ్ యోజన' ద్వారా పోషకాహారం కోసం ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తోంది. అయితే, ఈ పోరాటంలో ప్రజల భాగస్వామ్యం అత్యం త కీలకం. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానానికి దూరంగా ఉండటం అత్యవసరం. ఎందుకంటే టీబీ మందులు కాలేయంపై కొంత ప్రభావం చూపు తాయి, ఆ సమయంలో మద్యం సేవించడం వల్ల కాలేయం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**క్షయ అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమస్య కాదు, ఇది ఒక సామాజిక విపత్తు. ప్రపంచ జనాభాలో నాలుగో వంతు మందిలో ఈ బాక్టీరియా ఉందన్న నిజం మనల్ని అప్రమత్తం చేయాలి. లక్షణాలు కనిపించిన వెంటనే సిగ్గుపడకుండా, నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స ప్రారంభించాలి. పౌష్టికాహారం తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మరియు రోగులకు సామాజిక మద్దతును అందించడం ద్వారానే మనం ఈ మహమ్మారిని తరిమికొట్టగలం. 2025 నాటికి టీబీ రహిత దేశంగా ఎదగాలన్న మన లక్ష్యం నెరవేరాలంటే.. అది ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని నిజం చేస్తూ, క్షయపై పోరాటంలో మనమంతా భాగస్వాములవుదాం.**

# పశ్చిమాసియా సంక్షోభం.. భారత్‌కు సవాళ్లు

- యుద్ధ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడే అవకాశం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- ఇంధన సరఫరా, నిల్వలపై కేంద్రం అప్రమత్తం
- లోక్‌సభలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, మార్చి 23:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. సోమవారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన, మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు విసురుతోందని చెప్పారు. భారత్ ఇంధన అవసరాల్లో కీలక భాగం పశ్చిమాసియా నుంచే వస్తోందని గుర్తు చేసిన మోదీ, యుద్ధం ప్రభావం ప్రజల జీవనంపై కూడా పడుతోందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, వారి భద్రతకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. 24 గంటల కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేసి సహాయం అందిస్తున్నామని చెప్పారు. విదేశాల్లో ఉన్న విద్యార్థులు సహా అందరికీ భారత దౌత్య కార్యాలయాలు సాయం చేస్తున్నాయని వివరించారు. ఇంధన సరఫరాపై కూడా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హోర్ముజ్ జలసంధి ఆయిల్, గ్యాస్ సరఫరాకు కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం 41 దేశాల నుంచి ఇంధనం దిగుమతి చేసుకుంటున్నామని, దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణ వల్ల 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయ్యిందని, ఇథనాల్ వినియోగం పెంపుతో ముడి చమురు దిగుమతులు తగ్గుతున్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ప్లాంట్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ముప్పు ఉన్నప్పటికీ భారత్‌పై దాని ప్రభావం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మోదీ చెప్పారు. ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు దేశం సిద్ధంగా ఉందని ధైర్యం వ్యక్తం చేశారు. పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని ప్రధాని కోరారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతియుత పరిష్కారం సాధించేందుకు భారత్ కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

# మోదీ రాజీపడ్డారు

- పార్లమెంటులో చర్చకు రావడం లేదు..
- వడోదరలో రాహుల్




వడోదర: పశ్చిమాసియాలో పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని తన ప్రసంగంలో ఎక్కడా కూడా అమెరికా పేరును ప్రస్తావించలేదని, నూటికి నూరు శాతం ఆయన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంట్రోల్‌లో ఉన్నారని విమర్శించారు. పార్లమెంటులో చర్చకు ప్రధాని రావడం లేదని, అందుకు ఆయన రాజీపడమే కారణమని అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో సోమవారంనాడు జరిగిన 'ఆదివాసి అధికార్ సంవిధాన్ సమ్మేళన్'లో రాహుల్ పాల్గొన్నారు. 'పార్లమెంటులో 25 నిమిషాలు ప్రధానమంత్రి మాట్లాడినట్టు విన్నాను. కానీ కచ్చితంగా ఒక మాట చెప్పగలను. ఆయన అన్నివిధాలా రాజీపడినందునే పార్లమెంటులో చర్చలో పాల్గొనడం లేదు. 25 నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. 100 శాతం ట్రంప్ కంట్రోల్‌లో ఆయన ఉన్నారు' అని రాహుల్ ఆరోపించారు. అమెరికాతో వాణిజ్య డీల్ పేరుతో భారత వ్యవసాయ రంగానికి తెలుపులు బార్లా తెరిచారని, దీంతో దేశీయంగా రైతుల పతనం ఖాయమని అన్నారు. 'ఇక్కడ ఉన్నవారంతా చిన్న రైతులు. అమెరికాలో వేలాది ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇక్కడ రైతులు చేతులతో పనిచేస్తే, అక్కడ మిషన్లతో పనిచేస్తారు. అమెరికా ఉత్పత్తులు ఇండియాకు రావడం మొదలైతే మన రైతుల పని ముగిసినట్టే' అని విశ్లేషించారు. గిరిజనులకు చెందిన భూములు, నీళ్లు, అడవులను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటోందని రాహుల్ ఆరోపించారు. ఆదివాసీలు అంటే ఇండియాలో నివసించే వారని, భూములు, నీళ్లు, అడవులపై నిజమైన హక్కులు వారివేనని అన్నారు. నరేంద్ర మోదీ, ఇతర బీజేపీ నేతలు ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా విగ్రహం ముందు చేతులు కట్టుకుని నిలబడతారని, నిజానికి బిర్సా ముండా జరిపిన పోరాట సిద్ధాంతాలు ఏవైతే ఉన్నాయో వాటిపై దాడి చేస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలను వనవాసీలుగా సంబోధిస్తూ వారి హక్కులను బీజేపీ కొల్లగొడుతోందని విమర్శించారు.

## 10 కేజీల ఎల్పీజీ సిలిండర్లపై
# కేంద్రం స్పష్టత

- ఆ వార్తలు ఊహాగానాలేనని కేంద్రం వివరణ
- ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి నిర్ణయం లేదు
- ప్రస్తుతం 14.2 కేజీల సిలిండర్లే కొనసాగింపు




**న్యూఢిల్లీ:** దేశంలో 10 కేజీల ఎల్పీజీ సిలిండర్లను ప్రవేశపెడతారన్న వార్తలను కేంద్ర పెట్రోలియం శాఖ ఖండించింది. గృహ వినియోగదారుల కోసం తక్కువ బరువు సిలిండర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వచ్చిన వార్తలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ ఈ విషయంపై స్పందిస్తూ, అలాంటి ప్రతిపాదనలు ఏవీ పరిశీలనలో లేవని తెలిపారు. 10 కిలోల ఎల్పీజీ సిలిండర్లపై వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలేనన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ కొరత ఏర్పడుతుందన్న వార్తల మధ్య, సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు చిన్న సిలిండర్లు తీసుకురానున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని కేంద్రం పూర్తిగా తోసిపుచ్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్లే గృహ వినియోగదారులకు సరఫరా అవుతున్నాయని, వాటిలో ఎలాంటి మార్పులు చేయాలనే ఆలోచన లేదని కేంద్రం స్పష్టం చేసింది.

# భారీగా తగ్గిన బంగారం ధరలు

## యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు



**హైదరాబాద్,మార్చి 23:**అమెరికా-ఇరాన్ మధ్య దాడులు ముదురుతుండటం, వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనల వల్ల ప్రపంచ మార్కెట్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దింతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. అమెరికా-ఇరాన్ యుద్ధం తీవ్రతరం కావడం, ముడి చమురు ధరలు అధికంగా ఉండటంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం మొదలైన కొత్తలో అందరూ పోటీ పడి బంగారం కొనడంతో ధరలు ఆకాశానికి అంటాయి. ఇప్పుడు అంత రేటు పెట్టి ఎవరూ కొనలేక పోతుండటంతో ధరలు మెల్లగా దిగివస్తున్నాయి. ధరలు బాగా పెరిగినప్పుడు కొన్నవారు, ఇప్పుడు ఆ లాభాన్ని నగదుగా మార్చుకోవడానికి ఉన్న బంగారాన్ని అమ్మేస్తున్నారు. దీనివల్ల మార్కెట్లో బంగారం నిల్వలు పెరిగి ధరలు తగ్గుతున్నాయి. బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉండటంతో, ప్రజలు బంగారం మీద కంటే డిపాజిట్లు లేదా బాండ్ల మీద పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం మొదలైంది. ఇది కూడా వడ్డీ రేట్లు పెరగడానికి దారితీస్తోంది. సోమవారం 1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.595 తగ్గి రూ.14,002, 22క్యారెట్ల ధర రూ. 545 తగ్గి రూ. 12,835, 18 క్యారెట్ల ధర రూ.446 తగ్గి రూ.10,502. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.5,950 తగ్గి రూ.1,40,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.5,450 తగ్గి రూ.1,28,350, 18 క్యారెట్ల బంగారం ధర రూ.4,460 తగ్గి రూ.1,05,020 వద్ద చేరింది. హైదరాబాద్,వరంగల్,నిజామాబాద్, ఖమ్మంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర రూ.15 తగ్గి రూ.230, కేజీకి రూ.2,30,000 వద్ద రూ.15,000 తగ్గింది.

# డిజిటల్ వోచర్లతో ప్రచారం

- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిర్ణయం
- దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో పార్టీలకు ఉచిత ప్రసార సమయం
- ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ టైమ్ వోచర్లు జారీ




**న్యూఢిల్లీ, మార్చి 23:** భారత ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కేటాయించేందుకు డిజిటల్ వోచర్ల విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. ఈ ఉచిత ప్రసార అవకాశం దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. త్వరలో జరగనున్న అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 39ఏ ప్రకారం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఈసీ తెలిపింది. ఐటీ ప్లాట్ ఫామ్ ద్వారా డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేసి ప్రసార సమయాన్ని కేటాయిస్తారు. ప్రసార సమయం అభ్యర్థుల జాబితా విడుదలైన రోజు నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండు రోజుల ముందు వరకు కొనసాగుతుంది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించి ప్రసార స్లాట్‌లను నిర్ణయిస్తారు. ప్రతి పార్టీకి 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయించబడుతుంది. గత ఎన్నికల్లో పార్టీల పనితీరు ఆధారంగా అదనపు సమయం కూడా ఇవ్వవచ్చు. రాజకీయ పార్టీలు ప్రసారం చేయబోయే కంటెంట్‌ను ముందుగానే సమర్పించి సాంకేతిక ప్రమాణాలను పాటించాలి. అదనంగా, ప్రసార భారతి ఆధ్వర్యంలో ప్యానల్ చర్చలు, డిబేట్లు కూడా నిర్వహించనున్నారు. ఈ విధానం ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను ప్రజలకు సమర్థంగా చేరవేయగలవని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని ఎన్నికల సంఘం అభిప్రాయపడుతోంది. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు మే 4న వెల్లడవుతాయి.



# మచిలీపట్నం కోర్టుకు బాంబు బెదిరింపు

**ఈ-మెయిల్ ద్వారా జిల్లా జడ్జికి హెచ్చరిక**

**కోర్టు పరిసరాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు**

**భద్రతా కారణాల వల్ల ప్రవేశం నిలిపివేత**

**అమరావతి:** కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు జిల్లా జడ్జికి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న న్యాయమూర్తి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కోర్టు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. భద్రతా చర్యల్లో భాగంగా కోర్టు ప్రాంగణంలోకి ఎవరినీ అనుమతించడం లేదు. అనుమానాస్పద వస్తువుల కోసం ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**ఈహెచ్ఎస్ బిల్లులపై నేరుగా సమీక్ష**

**అమరావతి, మార్చి 23:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ నిర్వహణలో సమూల మార్పులు శ్రీకారం చుట్టారు. గత కొంతకాలంగా ఈహెచ్ఎస్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం ఇకపై అన్ని రకాల లావాదేవీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ద్వారా ఆసుపత్రులు అందించే చికిత్స బిల్లులు నేరుగా ఆన్‌లైన్ ద్వారానే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయానికి చేరుతాయి, తద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చెల్లింపుల పక్రియ వేగవంతం అవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఈహెచ్ఎస్ విధానాన్ని ప్రభుత్వం సమగ్రంగా పునఃసమీక్షించి, ఉద్యోగులు, పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మరింత సరళీకృతమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పాత పద్ధతిలో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్ది, ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా ఆసుపత్రులకు సకాలంలో నిధులు విడుదలయ్యేలా చూడాలని, తద్వారా ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స నిరంతరాయంగా అందాలని ఆయన స్పష్టం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

**కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టు విచారణ**

**న్యూఢిల్లీ, మార్చి 23:** తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ పొడిగింపునకు సంబంధించి అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్దంగా ఉన్నారని, సీట్లు వృథా కాకుండా చూడాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపు అంశంపై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని, అయితే ఆ తేదీకి ఆంధప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎన్ఎంసీ నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదని కోర్టుకు న్యాయవాదులు చెప్పారు.

# మత్స్యకారుల రక్షణకు చర్యలు

**ఏప్రిల్ 15 నుంచి సముద్రంలో వేట నిషేధం: ఆనం**

**నెల్లూరు,మార్చి23:** ఆంధ్రా ప్రాంత మత్స్యకారుల రక్షణకు ఎంతటి వరకైనా వెళ్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి మత్స్యకారుల దాడులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏపీ మత్స్యకారులకు సంపూర్ణంగా అండగా ఉంటామన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి ఆనం సమీక్ష నిర్వహించారు. మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మాస్టర్ ఎ÷-లాన్ రూపొందిస్తున్నామన్నారు. మత్స్యకారుల సమస్యపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. హైపవర్ బోట్లతో మన సంపదను పొరుగురాష్ట్రాల మత్స్యకారులు దోచుకుంటున్నారు. సముద్ర జలాలపై గస్తీ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. ఏప్రిల్ 14 వరకు సముద్ర జలాల్లో గస్తీ ఉంటుంది. ఏప్రిల్ 15 తర్వాత రెండు నెలల పాటు వేట నిషేధం అమల్లో ఉంటుంది. సీఎం ఆదేశాలతో రేపు ప్రత్యేక బృందం నెల్లూరు జిల్లాకు వస్తోంది' అని మంత్రి తెలిపారు.



# స్టీల్ సిటీకి ఫౌండేషన్ ఇది

మొదటి పేజీ తరువాయి

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది.



ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

# పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు

**మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు చంద్రబాబు శంకుస్థాపన**

**హాజరైన కేంద్రమంత్రులు కుమారస్వామి**

**ఏటా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యం**

**అనకాపల్లి, మార్చి 23:** ఏపీ పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ప్రపంచంలోనే అగ్రగామి స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ఇండియా ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రులతో కలిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట లో ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 5,465 ఎకరాల్లో 2 దశల్లో దీనిని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు సంస్థ ప్రతినిధులతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ స్టీల్‌ప్లాంట్ మొత్తం పెట్టుబడి రూ.1,35,964 కోట్లు కాగా.. మొదటి దశలో 2,600 ఎకరాల్లో రూ.80 వేల కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికలు వేశారు. ఈ కర్మాగారంతో లక్ష మందికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆర్సెలార్ మిత్తల్ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ రెండు దశల్లో సాకారం కానుంది. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు నిర్మించనున్నారు. క్యాప్టివ్ పోర్టు ద్వారా మరో 6 వేల ఉద్యోగాలు లభిస్తాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ రీజియన్ పరిశ్రమల హబ్‌గా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



# మిట్టల్ స్టీల్‌తో పారిశ్రామిక హబ్‌గా విశాఖ

**రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్**



**అమరావతి, మార్చి 23:** ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా మారుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, యువ నేత, మంత్రి నారా లోకేశ్ కష్టానికి ప్రతిఫలం ఈ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ స్టీల్ పాంట్ ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నేడు ఓ గొప్ప మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఉక్కు రంగంలో రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిందని మంత్రి అనగాని వివరించారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఈ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది. ఈ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మరో 6 వేల ఉద్యోగాలు క్యాప్టివ్ పోర్ట్ ద్వారా రానున్నాయి. ఇక ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది.

# డ్రగ్స్ కేసులో నా కుమారుడు నిరపరాధి

**మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**

**కడప, మార్చి 23:** డ్రగ్స్ కేసులో నా కుమారుడు నిరపరాధి అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వివాదంపై కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కడప జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంపై క్లారిటీ ఇచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై సుధాకర్ యాదవ్ స్పందించారు. తన కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ వెళ్లిన మాట నిజమేనని పుట్టా సుధాకర్ యాదవ్ అంగీకరించారు. అయితే, తన కుమారుడికి ఎలాంటి





చెడు అలవాట్లు లేవని, ముఖ్యంగా డ్రగ్స్ తీసుకునే అలవాటు అస్సలు లేదని స్పష్టం చేశారు. మహేశ్ వద్ద నుంచి కనీసం బ్లడ్ శాంపిల్స్ తీసుకోకుండానే రిపోర్టులో పాజిటివ్ అని ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ధారణ పక్రియపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి సమర్పించినట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడించారు. పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇన్వెస్టిగేషన్ ముగిశాక అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత, మహేశ్ నిరపరాధి అని నిరూపించే అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

## క్రీడలతో నూతన ఉత్తేజం - భీమ్ భరత్



**చేవెళ్ల మార్చి 22 (సమయం న్యూస్):** మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామంలో శంకర్ గౌడ్ వారి నాన్న గారి జ్ఞాపకార్థం కీర్తి శేషులు లింగం గౌడ్ మెమోరియల్ టోర్నమెంట్ ఫైనల్ కి ముఖ్య అతిథిగా హాజరైన రంగా రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు TUFIDC చైర్మన్ శ్రీ చల్ల నరసింహ రెడ్డి ,చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ,రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ పాల్గొని బహుమతులు అందేజేశారు ...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరిగిందన్నారు .పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారు కూడా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు అనేవి సహజంగా జరుగుతుంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ గారు, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య , చేవెళ్ళ లేబర్ సెల్ అధ్యక్షులు వసీం , మాజీ సర్పంచ్ సత్య నారాయణ , శ్రీనివాస్ , వెంకట్ రెడ్డి , గ్రామ అధ్యక్షులు శ్రీ శైలం , వైస్ చైర్మన్ , చిలుకూరు రాజు , విఠల్ యాదవ్, గ్రామ పెద్దలు సోదరులు , తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు...

## షాబాద్ మండలం నాగర్ గూడ లో హిందూ సమ్మేళనం కార్యక్రమం



**చేవెళ్ల మార్చి 22 (సమయం న్యూస్) :** షాబాద్ మండలంలోని నాగర్ గూడ గ్రామంలో పీఎస్ఆర్ గార్డెన్ లో హిందూ సమ్మేళనం హిందువుల ఐక్యత గురించి జరిగినటువంటి కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై హిందూ మహాసమ్మేళనాన్ని విజయవంతం చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన ప్రారంభించి భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి వక్తలు హిందూ ధర్మం అలాగే సనాతన ధర్మం గురించి హిందూ ధర్మాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని దానిపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసుకొని భారతదేశాన్ని మొత్తం హిందూమయంగా చేయాలని వారు అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో నాగర్ కూడా శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థినిలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి అందరి అభినందనలు పొందారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం యొక్క కమిటీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు మెంబర్స్ అలాగే భజన మండలి కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## భీమ్ భరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు మెంబర్లు కార్యకర్తలు

- నూతన కిరాణా షాప్ ఓపెనింగ్ చేసిన భీమ్ భరత్





**చేవెళ్ల మార్చి 22 ( సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పెట్ మండలం పూలపల్లి గ్రామం నుండి 4వ మరియు 5 వ వార్డు సభ్యులు గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీమ్ భరత్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు నూతన శివ రామ్ కిరాణ జనరల్ స్టోర్ షాప్ ను ప్రారంభించిన బీమ్ భరత్ .శంకర్ పల్లి మండలం అంతప్పగూడ గ్రామ సీనియర్ నాయకులు పెంటయ్య నూతన కిరాణ జనరల్ స్టోర్ షాప్ ను ప్రారంభించిన చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ...ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న అంతప్పగూడ సర్పంచ్ బీరయ్య, ఉపసర్పంచ్ సప్ప సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ బబ్బి ,నారే గూడెం సర్పంచ్ దీపిక దశరథ్ ,మాదారం సర్పంచ్ అంజయ్య ,ఉప సర్పంచ్ అనంతయ్య ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు కే మాధవరెడ్డి ,ఎస్ సుభిత్ గౌడ్ ,ఎస్ బాలరాజు గౌడ్ ,బి నర్సింగరావు,జైపాల్ రెడ్డి, కే చెన్నయ్య, శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ అధ్యక్షులు యం డి నసీరోద్దీన్, ఉపాధ్యక్షుడు పెంటా రెడ్డి ,పలుగుట్ట నర్సింలు, శంకర్ పల్లి సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి ,పర్వేద సేవాదళ్ అధ్యక్షుడు జగదీష్, చెందిప్ప యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్ ,అంతప్పగూడ గుబ్బడి ,పత్తేపూర్ గ్రామస్తులు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు ఉత్సవాల సందర్భంగా ప్రత్యక్ష ప్రసారం వీక్షించిన రైతులు



**చేవెళ్ల: మార్చ్ 22 (సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గం రైతు వేదికలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ పర్యవేక్షణలో చేవెళ్ల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో జరిగిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రిఫైనరీ శంకుస్థాపన, రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేయగా.. చేవెళ్లలో రైతులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు నరసింహులు దామరగిద్ద, రవి సింగపగుడ, న్యాలట సర్పంచ్ బుచ్చయ్య, రావులపల్లి సర్పంచ్ రామచంద్రయ్య, ఎన్కెపల్లి సర్పంచ్ మహిపాల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, బాల కోటేశ్వరరావు, ప్రతిభ తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# చందనవెల్లిలో ఇందిరమ్మ ఇళ్లను , నూతన రోడ్డుకు శంకుస్థాపన,



- నాగర్ గూడ లో ఐ కేర్ ఆప్టికల్ ను ప్రారంభించిన మధుసూదన్ రెడ్డి



**చేవెళ్ల మార్చ్ 22 ( సమయం న్యూస్) :** చందానవెల్లి గ్రామంలో తలారి లక్ష్మమ్మ కి ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో వారు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. చందానవెల్లి గ్రామం న్యూ కాలనీలో ఫార్మేషన్ రోడ్ ప్రారంభించడం జరిగింది. షాబాద్ మండలం నాగర్‌గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఐకేర్ ఆప్టికల్" ను ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ,నవనీత స్వామి ,సర్పంచులు బండ స్వరూప మహేందర్ గౌడ్, నర్సింలు, ప్రభాకర్ రెడ్డి ,యాదయ్య నాయకులు శ్రీశైలం, రవీందర్ నాయక్ సుభాష్ రెడ్డి ,అభిది ,శ్రీనివాస్ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి ,రాజు గౌడ్ ,శ్రీహరి ,యాదయ్య, భార్గవ్ రామ్ ,రఫీక్, ఆఫ్సార్, మహేందర్ రెడ్డి ,రాఘవచారీ, వెంకటేష్, కిట్టు ,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

# ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

- నిబంధనల అమలుపై నిశిత పరిశీలన
- కాపీయింగ్ కు ఆస్కారం ఉండకూడదని ఆదేశం



**నిజామాబాద్, మార్చి 23( సమయం న్యూస్).** పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద హైస్కూల్ ఎగ్జామ్ సెంటర్లను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. ఈ మేరకు నిబంధనలు పాటించారా లేదా అని సి.సి ఫుటేజీల పరిశీలన ద్వారా నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ఎగ్జామ్ హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ నిశిత పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశ్న పత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## జిల్లాలోని పశుపోషకులు గాలికుంటు వ్యాధి నివారణపై అప్రమత్తంగా ఉండాలి.

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాల పల్లి మార్చి23( సమయం న్యూస్). :** సోమవారం ఐడిఓసి కార్యాలయంలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ ప్రచార రథాన్ని, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగాలికుంటు వ్యాధి ఒక అంటువ్యాధి కాగా, ఇది పికార్నో వైరస్ వల్ల సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి మన రాష్ట్రంలో ప్రధానంగా ఞా, ఘా, ఘూ×ఘా-1 రకాల వల్ల వ్యాపిస్తుందని, ఈ వ్యాధి సోకిన పశువుల్లో మరణాల శాతం తక్కువగానే ఉన్నప్పటికీ, పాలు దిగుబడి తగ్గడం, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ముఖ్యంగా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వ్యాధి లక్షణాలుగా పశువులకు అధిక జ్వరం (104°F - 106°F), నోరు మరియు కాళ్ల గిట్టల మధ్య బొబ్బలు, నోటి నుంచి చొంగ కారడం, పాలు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. పశువులు మేత, నీరు తీసుకోక నీరసించి మరణించే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి నివారణకు పశువుల పాకలను శుభ్రంగా ఉంచడం, 4 నెలల వయస్సు దాటిన దూడలు మరియు పెద్ద పశువులకు ఏడాదికి రెండుసార్లు (ప్రతి 6 నెలలకు ఒకసారి) టీకాలు వేయించడం అత్యంత ముఖ్యమని సూచించారు. వ్యాధి సోకిన పశువులను వెంటనే వేరుచేసి, పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రపరచి, నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ ఉపయోగించాలని తెలిపారు. వెంటనే సమీప పశువైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ఈ సంవత్సరంలో కూడా ఉచిత టీకాల కార్యక్రమం కింద పశువైద్య బృందాలు ప్రతి గ్రామాన్ని సందర్శించి, 3 నెలల వయస్సు దాటిన గేదె మరియు ఆవు జాతి పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించి, గుర్తింపుకోసం చెవిపోగు వేయించుకొని, వివరాలను దీనా=ఘా ఞాఘానఖణనాచీ-ఘాఞా లో నమోదు చేయాలని కోరారు. జిల్లాలో గాలికుంటు వ్యాధి నిర్మూలనకు ప్రతి పశుపోషకుడు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లాపశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, ఏడీ డా గోపాలకృష్ణ, పశు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్న 10వ తరగతి పరీక్షలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాల పల్లి మార్చి23( సమయం న్యూస్) :** జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

సోమవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి మరియు గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, పర్యవేక్షణ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని సూచించారు. పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, సెల్‌ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించే ముందు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాసులు మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నరేగా అభివృద్ధి పనులు మార్చి 28 నాటికి పూర్తి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- నరేగా సిసి రోడ్ల పై సంబంధిత అధికారులతో
- రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి,మార్చి-23(సమయం న్యూస్) :** నరేగా ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు మార్చి 28 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నరేగా ద్వారా చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నరేగా క్రింద 25.77 కోట్ల రూపాయలతో చేపట్టిన 398 సిసి రోడ్డు, ఇతర అభివృద్ధి పనులను మార్చి 28 నాటికి పూర్తి చేసి నెలాఖరు లోపు 14 కోట్ల బిల్లుల చెల్లింపు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, ఈఈ పంచాయతీ రాజ్ శంకరయ్య, డీఈ, ఏఈ లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, మార్చి 23,( సమయం న్యూస్). :** సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లికార్యాలయాల్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యాలయంలో నిరుపయోగంగా (పాడైన) ఉన్న పాత స్కానర్ ,ప్రింటర్ మొదలైన సామాగ్రి తొలగించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని, వారి దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల సరళి పరిశీలన

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగాం మార్చి23( సమయం న్యూస్):** పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో భాగంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు సరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్, సెయింట్ ఆల్ఫోన్సస్ హెచ్ఎస్, సెయింట్ మేరీస్ హెచ్ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరీక్షల సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, సదుపాయాలను, వైద్య శిబిరాన్ని పర్యవేక్షించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ తో లోపలికి ఎవ్వరినీ అనుమతించవద్దని స్పష్టం చేశారు.అదే విధంగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రహారీ గోడ సరిగా లేని చోట భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరీక్షలు నిష్పాక్షికంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు.ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మం, మార్చి 23: ( సమయం న్యూస్ ):** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు.సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నడ్డి చందు తనకు లంగ్ క్యాన్సర్ వచ్చిందని, వైద్య చికిత్స నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. చిన్న వెంకయ్య సర్వే నెంబర్ 175/ఘ లో వారసత్వ భూమి 17 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 3 గుంటల భూమి కొందరు ఆక్రమించుకున్నారని, దీనిని విచారించి, వారసత్వ హక్కులను పరిశీలించి తమ భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తగుచర్యలు తీసుకోవాలని కామేపల్లి తహసీల్దార్ ను ఆదేశించారు. తిరుమలాయ-పాలెం మండలం గోపయిగూడెం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ తనకు వికలాంగుల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కే. వెంకన్న కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వీటిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- జిల్లా ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా
- భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించి న్యాయం పొందాలి-ఎస్పీ

**నారాయణపేట, మార్చి,23(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలోకి వచ్చే ప్రజా ఫిర్యాదులను ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపిఎస్ సిఐలు, ఎస్సై లకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా తీసుకోవాలని, వారి సమస్యలను శ్రద్ధగా వినాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు రావడం అనేది వారి సమస్యకు పరిష్కారం దొరకాలనే ఆశతోనేనని, అందువల్ల ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను స్టేషన్‌లో నమోదు చేసిన వెంటనే పరిష్కారం లభించకపోతే ఇంత దూరం రాకుండా సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. సర్కిల్ స్థాయిలో కూడా సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత డీఎస్పీని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.అదేవిధంగా, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, అందులో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.పోలీస్ స్టేషన్లలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని, ప్రతి ఒక్కరూ తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు.జిల్లా ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించి న్యాయం పొందాలని ఎస్పీ సూచించారు.

# విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాలమార్చి 23,( సమయం న్యూస్) :** 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు -- 163 BNSS (సెక్షన్ 144) అమలు.
- పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి.ఎస్పీ





**నారాయణపేట, మార్చి,23(సమయం న్యూస్) :** పదవ తరగతి పరీక్షల సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్, గర్ల్స్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడుతున్న తీరును సమీక్షించి, పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 43 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు వెళ్లే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని పరీక్ష కేంద్రాలకి సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని, పరీక్షలు సజావుగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 163 దీచీూా (సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలన్నారు. పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని (100 మీటర్ల పరిధిలో) అన్ని ఫోటోకాపీ (జిరాక్స్) మరియు ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఈ కేంద్రాలు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.ఎస్పీ వెంట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ఎస్ బీ ఎస్సై నరేష్ సిబ్బంది ఉన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్.

**కొత్తగూడెం మార్చి 23 ( సమయం న్యూస్) :** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ములుగు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు?

**ములుగు :మార్చి 23( సమయం న్యూస్) :** ములుగు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కలకలం రేపింది, కోర్టులో బాంబు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తులు ఈమెయిల్ ద్వారా పంపారు.కోర్టులకు వరుసగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఏపీ, తెలంగాణలో పలు జిల్లా కోర్టులకు బెదిరింపుల కలకలం రేపగా, సోమవారం ములుగు జిల్లా కోర్టుకు కూడా అలాంటి హెచ్చరిక వచ్చింది.ములుగు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆగంతకుల నుంచి ఈమెయిల్ రావడంతో వెంటనే చర్యలు ప్రారంభించారు. పోలీసులు కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి, పూర్తిగా తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రతి మూలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.ఈ ఘటనతో కోర్టు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలి కాలంలో వరుసగా ఇలాంటి బెదిరింపులు రావడంతో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్-ప్రతీక్ జైన్



**నారాయణపేట,మార్చి,23(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేంద్రంలో కొనసాగుతున్న పరీక్షా సరళిని ఆయన పరిశీలించారు.పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా విద్యా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసతి సదుపాయాలు కల్పించాలన్నారు.సోమవారం నాటి పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారని ఆరా తీశారు.

# కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు..

- సాంస్కృతిక కార్యక్రమాలు పాల్గొన్న నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు...
- విద్యార్థులకు మెమేంటులు అందజేసిన మాజీ మున్సిపల్ చెర్ పర్సన్ ఉషరాజేందర్



**కొడంగల్ మున్సిపల్, మార్చి,23(సమయం న్యూస్) :** మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు.... సంస్కృతి కార్యకరం అంగరంగ వైభవంగా నిర్వహించారు.. విద్యార్థుల సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.. విద్యార్థులకు ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు. స్పాన్సర్ మిఠాయి రాజు ఉషారాణి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, విద్యార్థులకు మోమెంటులు అందజేసి అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ లక్ష్మి వెంకటయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ డివి నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమరవీరుల వర్ధంతి సందర్భంగా యువ భారత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**పరిగి మున్సిపల్, మార్చి 23 (సమయం న్యూస్) :** పరిగి పట్టణ కేంద్రంలో అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా యువ భారత్ వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పల్లవి డిగ్రీ కళాశాల నుండి కొడంగల్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో అతి చిన్న వయసులోనే అలుపెరుగని పోరాటం చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఈ మహానుభావుల త్యాగాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని అన్నారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన వారి బలిదానాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా ఆఫీసర్ శ్రీశైలం, పల్లవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కోచ్ నారాయణ గౌడ్, పెంటయ్య గుప్తా, అనిల్ గౌడ్, ముకుంద నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని అమరవీరుల జయధ్వానాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS.**



**వికారాబాద్, మార్చి,23(సమయం న్యూస్) :** 2016 సంవత్సరం లో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కారాగార శిక్ష , 12000 రూపాయల విధిస్తూ తీర్పునిచ్చిందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పరిగి మండలం, బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య (37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం మరియు బెదిరింపులకు (ఖ్రాజ సెక్షన్లు 376, 506) సంబంధించి కేసు (జతీ చీశీ: 268/2016) నమోదైంది. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కొనసాగింది. పోలీసులు సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి చౌదరి చంద్ర కిషోర్, నిందితుడు అంజయ్య దోషిగా నిర్ధారిస్తూ 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 12,000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విశేష కృషి చేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వై. నాగేష్ (అప్పటి పరిగి ఎస్సై), పి. ప్రసాద్ (అప్పటి పరిగి సిఐ ), ప్రస్తుత పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ మోహన్ కృష్ణలను,అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పి.పి. శ్రీమతి మెరాజ్ ఫిర్దౌస్, సి.డి.ఓ జగన్ మోహన్ రెడ్డి, మరియు కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్. నిరంజన్ గౌడ్ ల పనితీరును ఎస్పీ ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

# పాలనాపరమైన కీలక అంశాలపై అధికారులతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సమీక్ష

**హైదరాబాద్, మార్చి 23సమయం న్యూస్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్ని విభాగాల అధిపతులు, జోనల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లు మరియు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలన పనితీరు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగంపై ఆమె సమీక్షించారు.సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. పాలనలోని అన్ని విభాగాల్లో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాలని, పారదర్శకతను పెంపొందించాలని మరియు వ్యక్తిగత విచక్షణకు తావు లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం మరియు పౌర సేవలే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, కమిషనర్ ఆదేశాలను జారీ చేశారు. సమయపాలన: అన్ని ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా స్పష్టమైన మరియు బాధ్యతాయుతమైన సమాధానాలతో పరిష్కరించాలి.క్షేత్రస్థాయి తనిఖీలు: సంబంధిత అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, వాటికి సంబంధించిన ఆధారాలను మరియు పత్రాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.కేవలం ఫిర్యాదుల సంఖ్యే కాకుండా, పరిష్కార నాణ్యత కూడా ముఖ్యమని కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా తిరస్కరించబడిన ఫిర్యాదులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.జనన-మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తి పన్ను మరియు ఇతర పౌర సేవలపై అధికారులకు ఈ క్రింది సూచనలు చేశారు:ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయకూడదు.అన్ని పత్రాలు సరిగ్గా ఉన్న దరఖాస్తులను అనవసరంగా ఆలస్యం చేయడం లేదా తిరస్కరించడం చేయకూడదు.సిటిజన్ చార్టర్ గడువులను ఖచ్చితంగా పాటించాలి, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై జరిమానా విధించబడుతుంది.పౌర సేవా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని, పారదర్శకతను పర్యవేక్షించే వ్యవస్థలు ఉండాలని ఆమె ఆదేశించారు. వీటితో పాటు ప్రతికూల వార్తలు, వాట్సాప్ ఫిర్యాదులు మరియు 'ప్రజావాణి' దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి వారం 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్' సమర్పించాలని సూచించారు.ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, ఆక్రమణల తొలగింపు మరియు మౌలిక సదుపాయాల విషయంలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండాలని, క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఆమె కోరారు.

అవినీతి మరియు విధి నిర్వహణలో లోపాలను సహించేది లేదని, పారదర్శకమైన మరియు ప్రజాహితమైన పాలన అందించడమే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లక్ష్యమన్నారు కమిషనర్ సృజన.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఫార్మ్ మెకనైజేషన్ & తేనెటీగల
- పెంపకం పథకాలపై కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి, మార్చి 23( సమయం న్యూస్). :** జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి (=ూణ), తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో జిల్లాలో అమలవుతున్న ఫార్మ్ మేకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని పరిశీలించి, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (ఖజం) వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని, రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు.ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని , ఈ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని, ఎక్కువ మంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, కమర్షియల్ స్థాయిలో తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ ఏపీడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.**

**- ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 ఫిర్యాదులు స్వీకరణ- కలెక్టర్**

**వికారాబాద్, మార్చి 23(సమయం న్యూస్) :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు.ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వివిధ శాఖ ల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణము డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.

99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు.ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి ,జడ్.పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ మంగీ లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసిఏఐ, ఎస్ఆర్ఎస్బీలో కో-ఆప్టెడ్ మెంబర్గా పి.వి. నారాయణరావు





**హైదరాబాద్, మార్చి 23 :** ప్రతిష్టాత్మకమైన ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాఆధ్వర్యంలో నిర్వహించిన సస్టైనబిలిటీ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ బోర్డు (ూ=ూదీ) కో-ఆప్టెడ్ మెంబర్గా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సి.ఏ. పి. వి. నారాయణరావు నియమితుల య్యారు. ఈ నియామకం చార్టర్డ్ అకౌంటింగ్ రంగంలో విశిష్ట గౌరవంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "×జూ×× నా సేవలు గుర్తించి బాధ్యత అప్పగించినందుకు మరింత నాకు బాధ్యత పెరిగింది. సస్టైనబిలిటీ రిపోర్టింగ్ ద్వారా భారతదేశంలో పారదర్శక, బాధ్యతాయుత కార్పొరేట్ వ్యవస్థను బలోపేతం చేయడంలో నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**సేవలు -- నాయకత్వంలో నిబద్ధత...**2015లో ICAI వరంగల్ బ్రాంచ్ చైర్మన్గా సేవలు అందించగా, 2016లో ×జూ× సెంట్రల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీలో కో-ఆప్టెడ్ మెంబర్గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్గా సేవలందిస్తున్నారు. ఇరు రాష్ట్రాల్లో చార్టర్డ్ అకౌంటెంట్లకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు.

**బోర్డు ప్రధాన లక్ష్యాలు:**కంపెనీలకు సస్టైనబిలిటీ రిపోర్టింగ్ ప్రమాణాలు రూపొందించడం, పర్యావరణ, సామాజిక బాధ్యతలపై ఆడిట్లు, ూజుదీ×, వీజూ, చీ×ు× ఆయోగ్ వంటి సంస్థలతో భాగస్వామ్యం, హరిత విప్లవం కోసం మార్గదర్శకత్వం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే సంస్థలకు అవార్డులు అందించడం, జూలకు శిక్షణ వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దీని యొక్క ముఖ్య ఉద్దేశం. నియామకంపై ఇరు తెలుగు రాష్ట్రాల ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ -దీపక్ తివారి.



**వికారాబాద్, మార్చి,23(సమయం న్యూస్) :** సోమవారము జిల్లా కేంద్రంలోని పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విద్యార్థుల హాజరు, డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీశారు.పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు.విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా పరీక్ష హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ పరిశీలన చేశారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# తాత్కాలిక ఉద్యోగుల నియామకం అంశంపై చర్యలు

**● ఐటీడీఏ పీవోకు ఎల్ హెచ్ పి ఎస్ వినతి**



**ఖమ్మం , మార్చి 23 : ( సమయం న్యూస్ ):** ఐ టి డి ఏ పరిధిలో తాత్కాలిక ఉద్యోగుల నియామకం అంశంపై దృష్టి సారించి , జరుగుతున్న అవినీతి , అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి , తగు విధమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ పీవోకు లంబాడి హక్కుల పోరాట సమితి ( ఎల్ హెచ్ పి ఎస్ ) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగాలంబాడీ హక్కుల పోరాట సమితి బినంగారాబేరి ( ఎల్ హెచ్ పి ఎస్ ) రాష్ట్ర అధ్యక్షులు బానోతు బద్రు నాయక్ , భద్రాద్రి బి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుభూక్య లాలూ నాయక్ లు మాట్లాడుతూ భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని గురుకులం విభాగంలో తాత్కాలిక ఉద్యోగుల నియామక ప్రక్రియ లోఅవినీతి జరుగుతుందని , అన్హర్హులకుఉద్యోగాలు ఇచ్చారనేవినవస్తున్న బలమైన ఆరోపణలపై తమ సంఘం దృష్టి సారించగా కొన్ని విషయాలు వెలుగు చూసాయని తెలిపారు. ఆర్ సి ఓ, తమ కన్ను సన్నల పై పనులు చేసే , జేబులు నింపే వారికే ఈ ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలను గుర్తు చేశారు. ఈ ఎం ఆర్ ఎస్ ( ఏకలవ్య గురుకుల పాఠశాల ) లో 2023 బి 24 సంవత్సరంలో ఎలక్ట్రిషన్ , ప్లంబర్ ఉద్యోగాలకుదరఖాస్తులు ఆహ్వానించి , తమకు అనుకూలమైన వారి కీ ,అన్హర్వులకే ఉద్యోగాలు ఇచ్చారని విమర్శించారు. ఇష్టానుసారంగా పేర్లుమార్చార ని ఆరోపించారు. పిఓఉత్తర్వుల కు వ్యతిరేకంగా 50 వేల రూపాయల లంచం స్వీకరించి , ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగిని , యు ఆర్ ఎ సి తిరుమలాయపాలెం నుండి ఆర్ జె సి సుదిమల్ల కళాశాలకు మార్చారని తెలిపారు. మహిళా కళాశాల గురుకుల పాఠశాలలో పురుష అభ్యర్థులను నియమించకూడదని నిబంధనలను ఉన్న కూడా వాటిని అధిగమించి , ఆర్సిఓ నిబంధనలను తూర్పు పొడిచారని పేర్కొన్నారు. తాత్కాలిక ఉద్యోగ నియామకాలు , ట్రాన్స్ఫర్లు ,డిప్యూటేషన్లు వంటి అనేక విషయాలలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు చేశారు. గిరిజన గురుకులం ఆర్ సి ఓ కూడా అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. మీ వంటి అధికారి చిత్తశుద్ధితో గిరిజనుల అభివృద్ధి కోసం ఓవైపు పని చేస్తుంటే మరోవైపు ఇటువంటి అధికారులు గిరిజనుల భవిష్యత్తును చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపించి , తగువిధమైన చర్యలు చేపట్టాలని కోరారు . వినతి పత్రం సమర్పించిన బృందంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవ నాయక్ , జిల్లా కార్యదర్శి వీరన్న నాయక్ , ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మోహన్ నాయక్ తదితరులు ఉన్నారు.

# ఈద్ మిలాప్ తో ప్రజల మధ్య ఐకమత్యం




**ఖమ్మం , మార్చి 23 : ( సమయం న్యూస్ ):** భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని ఈ విషయంలో భారతదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని , ఈద్ ముబారక్ అ నేకార్యక్రమం ద్వారా ప్రజల మధ్య ఐకమత్యం , సోదర భావం , మతసామరస్యం వెల్లి విరుస్తుందని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిక్ అహ్మద్ అన్నారు. ఖమ్మం షాదీ ఖానాలో జమాఅతె ఇస్లామి హింద్ నగర అధ్యక్షులు జైను ల్ పాషా అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగిన ఈద్ మిలాప్ (పండగ కలయక) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈద్ మిలాప్ కార్యక్రమం చాలా గొప్పదని దీని ద్వారా సమాజంలో ప్రజల మధ్య ఐకమత్యం, మతసామ-రష్యం, సోదరబావము పెంపొందుతాయన్నారు అందుకే భారతదేశము అనేక మతాల సాంప్రదాయాల నిలయమని భిన్నత్వంలో ఏకత్వం అని దీని ప్రత్యేకత అని దీని అందరూ కాపాడుకోవాలని అన్నారు .మనందరి సృష్టి కర్త అయిన దేవుడు ఒక్కడే. మనమంతా ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా ఒకరి సుఖదుఃఖాలను మరోకరు పంచుకుంటూ కలిసి మెలిసి జీవించినప్పుడే సమాజం లో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయని అన్నారు. దివ్య ఖుర్ఆన్ బోధనలు మానవాళికి ఇహంలోనూ, పరంలోనూ దారిచూపుతాయని, మంచి, చెడుల విచక్షణ చూపే ఈ గ్రంథం రమజాన్ నెలలో అవతరించి ందనిఅందుకుగాను రమజాన్ నెలకు ప్రాముఖ్యం లభించిందని అన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులమతాల హెచ్చుతగ్గులు లేవని, ఉన్నదాంతో తృప్తి పడుతూ, మంచివారిగా జీవించాలి రంజాన్ ఉపవాసాలు శిక్షణ ఇస్తాయని అన్నారు.పండుగలు పర్వదినాలు మరోకరు పంచుకుంటే ప్రేమానురాగాలు ఆప్యాయత అనుబంధాలు పెరుగుతాయని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూభారతదేశం సర్వ మతాలకు ఒక వేదిక హిందూ, ముస్లిం, క్రిస్టియన్ , సిక్కు, జైన్ అన్ని మతాలవారు కూడా ఒకరి మతాలను గౌరవిస్తూ ఒకరి అభిప్రాయాలను ఒకరిగౌరవిస్తూనే అంతిమంగా మానవాళి శ్రేయస్సు మానవ ధర్మమే లక్ష్యంతోనే అందరు ముందుకు సాగాలి అన్నారు. ఈ కార్యాక్రమములో జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఇలియాస్ సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్,ఐట రీజనల్ సెక్రెటరీ మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, జిల్లా మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్, యం పి జె జిల్లా అధ్యక్షులు ఖాసిం, లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బద్రి నాయక్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ మతిన్ జమాఅతె ఇస్లామి హింద్ సభ్యులు జమీల్ అహ్మద్ ఖాన్, అబ్దుల్ సమి,ఫయాజ్ ,అబ్దుల్ రజాక్ , లతీఫ్, ఇలియాస్, గౌస్,మొయినుద్దీన్, ఇబ్రహీం షరీఫ్, హిమాదుద్దీన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్,సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలుహుస్సేన్ బి ,సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా , జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదవ్ సభ్యులు నస్రీన్ , సుమయ్య , షాకిరా ,రఫిఖా , ఫాతిమా , నసిమా, ఆరిఫా, జహెరా ,గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణఅధ్యక్షురాలు అమ్రీన్ , ముస్లిం, ముస్లిమేతరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడి సమాజానికి ప్రమాదం

**● జర్నలిస్టులపై దాడికి పాల్పడినవారిని రిమాండ్ చెయ్యాలి**
**● చేవెళ్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన ఎం.జే.ఎఫ్ నాయకులు**
**● రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసుల జాప్యం**
**● జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి**
**● ఎంజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి.**



**చేవెళ్లమార్చి 23(సమయం న్యూస్) :** షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఎంజేఎఫ్ ( మాదిగ జర్నలిస్ట్ ఫోరం ) చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి జర్నలిస్టులతో కలిసి చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే కలం సైనికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, సమాజంపై ఉందని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించే రిపోర్టర్లపై భౌతిక దాడులు, బెదిరింపులు, ఆన్‌లైన్ వేధింపులు పెరిగిపోతున్నాయని, ఇదే కోణంలో షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి జరిగిందని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి 20 రోజులు కావస్తున్న నిందితులను రిమాండ్ చెయ్యకుండా రాజకీయనాయకులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అధికారులు కేసు పురోగతిలో కాలయాపన చేస్తుండటంతో నిందితులు సాక్షులను, ఆధారలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. అంతే కాకుండ విధినిర్వహణలో ఎన్నో కష్టాలకోర్చి అనేక వాస్తవిక స్థితిగతుల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే జర్నలిస్టులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుంది. కానీ అదేస్థాయిలో వారు ఎన్నో ఒత్తిళ్లను తట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి నిగ్గు తేల్చే నిజాలను ప్రజల ముందుంచుతారు. అలాంటి జర్నలిస్టులపై బెదిరింపులు, నిర్బంధాలు, దాడులు, అపహరణ, హత్యలు లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి దాడులను ప్రతి ఒక జర్నలిస్టు ఖండించి, మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కో. కన్వీనర్ నర్సాని రమేష్, జర్నలిస్టులు నరేందర్, అమర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరం విజయవంతం

**● శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం ఆధ్వర్యంలో సాన్స్ స్కిన్ హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్ హాస్పిటల్ ఉచిత చర్మ జుట్టు వ్యాధి వైద్య శిబిరం విజయవంతం**



**చేవెళ్ల మార్చి 23: (సమయం న్యూస్):** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డా. సాయిసింధు అన్నారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్ శివారులో గల సాన్స్ స్కిన్ హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్ హాస్పిటల్ ఉచిత చర్మ జుట్టు వ్యాధి వైద్య శిబిరం సోమవారం చందిప్ప గ్రామంలో వెలసిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత డెర్మటాలజీ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నేడు మన తీసుకునే ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కాలుష్యాల వలన ప్రతి ఒక్కరు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని, ఇలాంటి పరిస్థితిలో స్కిన్ పట్ల నిర్లక్షం వద్దని, ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.వైద్యుల సూచనలు తప్పకుండ పాటించి మందులు వాడితే వ్యాధులు నయం అవుతాయని ఆమె చెప్పారు. ఈ శిబిరంలో 86 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మరకత శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకం చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి డా. సాయి సింధును స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ శేఖర్, మాజీ చైర్మన్ సదానందం గౌడ్, కమిటీ సభ్యులు హన్మంతు, శ్రీనివాస్, ఆలయ అర్చకులు సాయిశివ, ప్రమోద్, వీరేష్ ఉన్నారు.

# ప్రజావాణికి 37 ఫిర్యాదులు

**● ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి**
**● కలెక్టర్ ప్రతీక్ జైన్.**



**నారాయణపేట, మార్చి,23(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి... హాజరైన మండల అధికారులు




**పరిగి మున్సిపల్, మార్చి 23(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జి. సుబ్రహ్మణ్యం (డిప్యూటీ.ఇఇ, యంబి ఇంట్రా), కె. సింధు (ఐసిడియస్ పర్యవేక్షకురాలు గ్రేడ్-1), ఎం. అంజయ్య (యంఇఒ), ఎస్. ఉష (అడిషనల్. పిఓ), ఎస్. లక్ష్మీకాంత్ రెడ్డి (జూనియర్ అసిస్టెంట్ – రెవెన్యూ), పి. రాజు (ఏపియం), బి. రోజా (ఏఇ, గృహనిర్మాణ శాఖ), ఆర్. హరికృష్ణ (ఏఇ, విద్యుత్ శాఖ, పరిగి), సి. విజయ్ కుమార్ (ఏఇఓ, వ్యవసాయ శాఖ, పరిగి) తదితరులు పాల్గొన్నారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు.

# కలెక్టరేట్ భవన ఆవరణలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**నారాయణపేట,మార్చి,23(సమయం న్యూస్) :** నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం ఆవరణ లో అంతర్గత రహదారుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు సమాంతరంగా రోడ్డు వేయాలన్నారు. అలాగే భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను అక్కడి నుంచి తొలగించి కొద్ది దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు పెట్టి గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీఆర్డీవో మొగులప్ప కు చెప్పారు. కలెక్టరేట్ సముదాయంతో పాటు బయట రోడ్లు, ఇతర పనుల్లో వేగం పెంచాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీ.ఈ.ఈ రాములు, పంచాయతీ రాజ్ ఈ ఈ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# షాబాద్ మండలం నాగర్ గూడ లో హిందూ సమ్మేళనం కార్యక్రమం



**చేవెళ్ల మార్చి 23 (సమయం న్యూస్) :** షాబాద్ మండలంలోని నాగర్ గూడ గ్రామంలో పీఎస్ఆర్ గార్డెన్ లో హిందూ సమ్మేళనం హిందువుల ఐక్యత గురించి జరిగినటువంటి కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై హిందూ మహాసమ్మేళనాన్ని విజయవంతం చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన ప్రారంభించి భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి వక్తలు హిందూ ధర్మం అలాగే సనాతన ధర్మం గురించి హిందూ ధర్మాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని దానిపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసుకొని భారతదేశాన్ని మొత్తం హిందూమయంగా చేయాలని వారు అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో నాగర్ కూడా శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థినిలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి అందరి అభినందనలు పొందారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం యొక్క కమిటీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు మెంబర్స్ అలాగే భజన మండలి కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# దామగుండంలో నేవీ రాడార్ పనులను పరిశీలించిన పరిగి- ఎమ్మెల్యే...

● ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి ని సన్మానించిన నౌకాదళ వైస్ అడ్మిరల్ -సంజయ్ వత్సాయన్



**పూడూర్ మండలం, మార్చి,23(సమయం న్యూస్) :** పూడూరు మండలం దామగుండంలో నిర్మాణంలో ఉన్న నేవీ రాడార్ స్టేషన్ పనులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, భారత నౌకాదళ వైస్ అడ్మిరల్ సంజయ్ వత్సాయన్ కలిసి పరిశీలించారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రాజెక్టు సాధనలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే టీఆర్ఆర్ ను ఈ సందర్భంగా వైస్ అడ్మిరల్ సంజయ్ వత్సాయన్ సన్మానించి మొమెంటో అందజేశారు. ఈ ప్రాజెక్టు ప్రాంత అభివృద్ధితో పాటు దేశ భద్రతకు కూడా దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## వికారాబాద్ జిల్లా నూతనంగా నియామకమైన జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారి ని మర్యాదపూర్వకంగా కలిసిన చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య .



**చేవెళ్ల మార్చ్ 23 (సమయం న్యూస్) :** ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలో నవాబు పేట్ మండలం అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అలాగే నియోజకవర్గంలో కొనసాగుతున్న మరియు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. నవాబు పేట్ మండలం సమగ్ర అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# చేవెళ్లలో డయాలసిస్ పేషెంట్లకు త్వరగా సేవలు అందుబాటులోకి తీసుకురావాలి

● చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య .



**చేవెళ్ల మార్చ్ 23 ( సమయం న్యూస్) :** చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు నిలిచిపోవడంతో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన ఐజనూ అనురాగిణి తో కలిసి స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య డయాలసిస్ సెంటర్ ,పాలియేటివ్ కేర్ విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాలియేటివ్ కేర్ విభాగంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదికలు పంపినట్లు అధికారులు వివరించారు. డయాలసిస్ సేవలు అత్యవసరమని పేర్కొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య ,త్వరగా డయాలసిస్ పేషెంట్లకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి ,ప్రజాప్రతినిధులు, అధికారులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

# పేకాట స్థావరంపై దాడులు

● 11 మంది అరెస్ట్ -- నర్వ ఎస్సై పబ్బతి రమేష్



**నర్వ మండలం, మార్చి,23(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో అక్రమంగా పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, నర్వ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాటలో పాల్గొంటున్న 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 1,22,900/- నగదు, 9 మోటార్ సైకిళ్లు, 11 సెల్ ఫోన్లు మరియు పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నర్వ ఎస్సై పబ్బతి రమేష్ మాట్లాడుతూ... గేమింగ్ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని నర్వ ఎస్సై హెచ్చరించారు.

# గొప్ప స్వతంత్ర సమరయోధుడు కామ్రేడ్ భగత్ సింగ్.

● ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలి.

● పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్.



**చేవెళ్ల మార్చ్ 23 (సమయం న్యూస్) :** కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, ల 95 వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ మాట్లాడుతూ హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీ ( హెచ్ఎస్ ఆర్ ఏ ) సైమన్ కమిషన్ గో బ్యాక్ ఉద్యమంలో స్కాట్ అనే బ్రిటిష్ అధికారి లాలా లజపతిరాయ్ ని చంపాడు. దీనికి ప్రతీకారంగా పొరపాటున భగత్ సింగ్ స్కాట్ కు బదులు మరొక అధికారి జేపి శాండర్స్ ను చంపారు. ఇది దేశంలో ఒక సంచలనం అయింది. ఈ ఘటన భారత జాతీయ ఉద్యమంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లను అగ్రశ్రేణిలో నిలిపింది. ఆనాటి రైతంగాన్ని కార్మికులను యువకులను విద్యార్థులను ఉద్యమంలోకి తీసుకురావడం కోసం నవ జవాన్ భారత్ సభను ఏర్పాటు చేశారు. దీని తదనంతరం కమ్యూనిస్టు పార్టీకి కూడా అనుబంధ సంఘంగా నడిపారు. ఉధృతం అవుతున్న కార్మిక విద్యార్థి రైతంగ ఉద్యమాలు ప్రాబల్యం పెంచుకుంటున్న కమ్యూనిస్టులను అణిచివేయడం కోసం కుట్రపూరితంగా బ్రిటిష్ ప్రభుత్వం పబ్లిక్ సేఫ్టీ బిల్, కార్మిక వివాదాల బిల్లులను తీసుకొచ్చింది. దీనికి నిరసన తెలియజేయడానికి భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్, లు పార్లమెంటు సెంట్రల్ హాల్లో పొగ బాంబులు విసిరారు. దానికి బ్రిటిష్ ప్రభుత్వం వీరిని అక్రమంగా అరెస్టు చేసి 1931 మార్చి 23న ఉరితీసింది. నో నోకి మీసాల నవ యవ్వనంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్, లు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. కులం, మతం, దోపిడీ, అంతరాలు లేని సమాజాన్ని కోరుకున్నారు. ఇంకిలాబ్ జిందాబాద్ అని నినదించారు అని అన్నారు. అదేవిధంగా ఎన్నికల హామీలలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు డివిజన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి శ్రీకాంత్, సురేష్, అనిల్, రాజేష్, సాయి, తదితరులున్నారు.

# జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు ఆరోగ్య సేవల్లో కీలక ముందడుగు

● జిల్లా కలెక్టర్



**సంగారెడ్డి, మార్చి 23( సమయం న్యూస్) :** సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. సోమవారం నుండి సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (ప్రాంజం), రెండు ఏరియా ఆసుపత్రులు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (ఖూంజం), ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (++ఎ), ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రోగుల ఆరోగ్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరచడం ద్వారా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించ వచ్చని ఆమె తెలిపారు. నెట్‌వర్క్, టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. ప్రతి రోజు ప్రగతిని సమీక్షిస్తూ, సమర్థవం తంగా అమలు చేపట్టాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ద్వారా రోగుల ఆరోగ్య చరిత్ర, పరీక్షల వివరాలు, చికిత్స సమాచారం అన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావు,డాక్టర్ శశాంక్, మెడికల్ ఆఫీసర్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# మినీ సరస్ మేళా ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

● శిల్పారామం లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకం



**మహబూబ్ నగర్ మార్చి23( సమయం న్యూస్) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శిల్పారామంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గ్రామాభివృద్ధి సంస్థలు,నాబార్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన "మినీ సరస్ మేళా" ను సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ నెల 29 వరకు నిర్వహించనున్న మినీ సరస్ మేళా ను ప్రజలు పెద్దఎత్తున సందర్శించి, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను కొని వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామీణ మరియు పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ఈ స్టాళ్లలో ప్రదర్శించి విక్రయానికి ఉంచారు. ఎగ్జిబిషన్ ప్రారంభం అనంతరం కలెక్టర్ కొన్ని స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. సభ్యులతో మాట్లాడి వారి అనుభవాలు, బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలు, ఉత్పత్తుల తయారీ విధానం, మార్కెటింగ్ విధానాలు, ఆదాయం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో మినీ సరస్ ఎగ్జిబిషన్ ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, డి.ఆర్.డి.ఎ, నగర పాలక సంస్థ ఇతర ,శాఖల అధికారులను ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారుఉమ్మడి జిల్లాలోని నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా స్టాళ్లు ఏర్పాటు చేసి, వారు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ మరియు ప్రోత్సాహం కల్పిం చడమేనని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. దీంతో వారు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. శిల్పారామం ఒక మంచి పర్యాటక స్థలం కావడంతో, ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సాయంత్రం వేళల్లో ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని సూచించారు. అలాగే సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి ఆనందంగా గడపవచ్చని తెలిపారు. ఈ మినీ సరస్ ఎగ్జిబిషన్‌లో స్వయం సహాయక సంఘాల స్టాళ్లతో పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'భరోసా', వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ క్యాంప్, బి.సి సంక్షేమ శాఖ, ఎస్‌బిఐ బ్యాంక్ స్టాళ్లు ఏర్పాటు చేసి, వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి,డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ మల్లు నర్సింహా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆర్.డి.ఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, నాబార్డ్ ఎ.జి.యం డి.ఈ. రవిశంకర్ , డి.డి.యం.షణ్ముఖ చారి,జిల్లా పరిశ్రమల కేంద్రం జి.ఎం. యాదయ్య, ఎల్.డి.యం. చంద్రశేఖర్, పాల్గొన్నారు.

# జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్త ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కొరకు దరఖాస్తులు.

● జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ మార్చి23( సమయం న్యూస్) :** జిల్లా కలెక్టర్/ చైర్మన్ గారు మహబూబ్ నగర్ జిల్లా లోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, మహబూబ్ నగర్ జిల్లా వారు "ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 2025-26" క్రింద రూ. 1.00 లక్ష రూపాయల వరకు ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు (90% సబ్సిడీ), రూ. 3.00 లక్షల విలువ గల త్రిచక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్/ గూడ్స్) వాహనాలు (70% సబ్సిడీ) మరియు రూ. 3.00 నుండి రూ. 7.00 లక్షల (రూ. 5.00 లక్షల వరకు 60% సబ్సిడీ) విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ మరియు వ్యవసాయ అనుబంధ భాగాల యూనిట్లను లోన్ల క్రింద ప్రకటించడం జరిగింది. వయస్సు 21-50 సం,,లు కల అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు మరియు 21-60 సం,,లు కల అభ్యర్థులు భూసంబంధ, వ్యవసాయ/ సోలార్ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకొనగలరు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు మరియు పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ. 2.00 లక్షలు మించి ఉండరాదు. మీ-సేవ నుండి పొందిన కులం మరియు ఒక సంవత్సరం లోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డ్ మరియు ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన దారిద్ర రేఖకు దిగువన కల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనగలరు. కావున అర్హత మరియు ఆసక్తికల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు TGOBMMS ఆన్లై న్ పోర్టల్ https ://tgobmmsnew. cgg.gov.in ద్వారా దర ఖాస్తులు నమోదు చేసుకోవచ్చును. ప్రక్రియ తేదీ. 17. 03.2026 నుండి 24.03 .2026 వరకు అం దుబాటులో ఉంటుంది. ఆన్లైన్ లో ధర ఖాస్తు చేసుకు న్న వారు సంబ ంధిత పత్రాలు ఎస్.సి. కార్పో రేషన్ కార్యాలయం, మహ బూబ్ నగర్ జిల్లా, రూమ్ నెం. 105, మొదటి అంతస్తు, సమీకృత జిల్లా ఆఫీసుల కార్యా లయము, కలె క్టరేటు నం దు (2) జిరాక్స్ కాపీలు సమర్పి ంచగలరు. ఇ తరవివర ములకు 9849905996నందు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పీఎస్ఎల్ 2026పై ఉగ్ర నీడ

- వార్నర్, స్మిత్ బ్యాట్ పడితే బాంబులు పేలుస్తాం!
- పీఎస్ఎల్‌ను వణికిస్తున్న ఉగ్రవాదుల ప్రకటన



**ఢిల్లీ:** మరో మూడు రోజుల్లో ప్రారంభం కావాల్సిన పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్‌ను ఉగ్రవాదుల భయం వణికిస్తోంది. పాకిస్థాన్‌లో క్రియాశీలంగా ఉన్న నిషేధిత ఉగ్రవాద సంస్థ 'తహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్'కి చెందిన జమాత్-ఉల్-అహ్రార్ విభాగం డైరెక్ట్‌గా విదేశీ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుంటామని బహిరంగంగా హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక సీనియర్ కమాండర్ పేరుతో విడుదలైన ప్రకటన ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

### వార్నర్, స్మిత్‌లకు ప్రత్యక్ష హెచ్చరికలు..

ఈసారి పీఎస్ఎల్‌లో ఆస్ట్రేలియా దిగ్గజాలు డేవిడ్ వార్నర్ (కరాచీ కింగ్స్ కెప్టెన్), స్టీవ్ స్మిత్ (ముల్తాన్ సుల్తాన్స్) వంటి స్టార్ ప్లేయర్లు పాల్గొంటున్నారు. ఉగ్రవాద సంస్థ విడుదల చేసిన తాజా ప్రకటనలో వీరిద్దరి పేర్లను ప్రత్యేకంగా ప్రస్తావించడం క్రికెట్ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. "మీ ఆటగాళ్లను పాకిస్థాన్‌కు పంపకండి. మైదానంలో వారికి ఏదైనా జరిగితే మా బాధ్యత కాదు" అంటూ వివిధ క్రికెట్ బోర్డులను ఉగ్రవాదులు బహిరంగంగా హెచ్చరించారు. వార్నర్, స్మిత్‌తో పాటు మార్నస్ లబుషేన్, మోయిన్ అలీ, డెవాన్ కాన్వే, ఆడమ్ జంపా వంటి స్టార్ ప్లేయర్లు కూడా ఈ లీగ్‌లో పాల్గొంటున్నారు.

### పీసీబీ సంచలన నిర్ణయం..

పరిస్థితి తీవ్రతను గమనించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ అత్యవసర నిర్ణయాలు తీసుకున్నారు.. భద్రతా కారణాల దృష్ట్యా పీఎస్ఎల్ 2026 మ్యాచ్‌లన్నీ ప్రేక్షకులు లేకుండానే నిర్వహించనున్నారు. మార్చి 26న జరగాల్సిన గ్రాండ్ ఓపెనింగ్ సెరిమనీని సైతం పీసీబీ రద్దు చేసింది. ముందుగా నిర్ణయించిన వేదికలను మార్చి, కేవలం లాహోర్, కరాచీ నగరాలకే ఈ మెగా టోర్నీని పరిమితం చేశారు. ఇదే సమయంలో మార్చి 26 నుంచి స్టార్ట్ కానున్న ఈ టోర్నీలో మొత్తం 44 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే, తాజా బెదిరింపుల నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లు పాకిస్థాన్‌లో కొనసాగుతారా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. ఇప్పటికే కొందరు ఆటగాళ్లు పీఎస్ఎల్ వదిలి ఐపీఎల్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

# ముంబై ఇండియన్స్ కెప్టెన్సీపై మళ్లీ చర్చ

- 'ముంబై ఇండియన్స్' కెప్టెన్సీ నుండి 'హార్దిక్ పాండ్య' అవుట్..?
- కొత్త కెప్టెన్ గా సూర్యకుమార్ యాదవ్ !
- కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు వైరల్





**ముంబై:** మరో 5 రోజుల్లో ఐపీఎల్ 2026 సీజన్ మొదలు కానుంది. అయితే ఇంతలో ముంబై ఇండియన్స్ జట్టులో కెప్టెన్సీ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ప్రస్తుత కెప్టెన్ హార్దిక్ పాండ్య తన నాయకత్వ బాధ్యతలను సూర్యకుమార్ యాదవ్ కు అప్పగించాలంటూ ఆయన సూచించారు. ముంబై ఇండియన్స్ చివరిసారిగా రోహిత్ శర్మ కెప్టెన్సీలో 2020లో టైటిల్ గెలిచింది. అంటే ముంబై ట్రోఫీ గెలిచి ఐదేళ్లు అవుతుంది. 2024లో గుజరాత్ టైటాన్స్ నుంచి ట్రేడ్ ద్వారా హార్దిక్ పాండ్యా తిరిగి ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చి కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టాడు. అయితే ఆ సీజన్ లో జట్టు పాయింట్ల పట్టికలో చివరిస్థానలలో నిలవడం పలు విమర్శలకు దారితీసింది. ఇక ఐపీఎల్ 2025 సీజ న్‌లో ప్లే ఆఫ్స్ కు చేరినా, ట్రోఫీ దక్కకపోవడంతో కెప్టెన్సీపై మళ్లీ రచ్చ మొదలైంది. ముఖ్యంగా రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి వరల్డ్‌కప్ విజేత కెప్టెన్లు జట్టులో ఉండగా హార్దిక్ పాండ్య నాయకత్వంపై ఇప్పుడు అందరూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం, జట్టు మేనేజ్మెంట్, అలాగే హార్దిక్, రోహిత్, సూర్యకుమార్ కలిసి భవిష్యత్‌పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్ లో సూచించారు. ఈ పరిస్థితిని "వింత పరిస్థితి"గా ఆయన పేర్కొనడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 టీమ్ ఇండియాకు విజయం అందించిన 'సూర్యకుమార్ యాదవ్' కెప్టెన్సీకి సరైన ఎంపిక అంటూ ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు హార్దిక్ పాండ్యానే స్వయంగా కెప్టెన్సీ నుంచి తప్పుకుని, సూర్యకుమార్ కు బాధ్యతలు అప్పగిస్తే సమస్య సులభంగా పరిష్కారం అవుతుందని శ్రీకాంత్ సూచించడం కొసమెరుపు. "సూర్యకుమార్ లీడ్ చేయాలి, నేను సపోర్ట్ చేస్తాను" అని హార్దిక్ చెబితే జట్టులో ఉన్న అంతర్గత సమస్యలు పూర్తిగా సర్దుకుంటాయని ఆయన అన్నారు.

# సీఎస్‌కే హిస్టరీలో మైలురాయి

- ఫస్ట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో సురేష్ రైనా, మాథ్యూ హేడెన్ ఎంట్రీ
- ఫైవ్-టైమ్ ఐపీఎల్ ఛాంపియన్స్ సీఎస్‌కే తన మొదటి హాల్ ఆఫ్ ఫేమ్‌ను ప్రకటించింది
- ఫస్ట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో సురేష్ రైనా, మాథ్యూ హేడెన్ ఎంట్రీ


**చెన్నై :** చెన్నై సూపర్ కింగ్స్ తన చరిత్రలో మరో మైలురాయిని సాధించింది. ఫైవ్-టైమ్ ఐపీఎల్ ఛాంపియన్స్ సీఎస్‌కే తన మొదటి హాల్ ఆఫ్ ఫేమ్‌ను ప్రకటించి, ఇందులోకి భారత ఆల్‌రౌండర్ సురేష్ రైనా, ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం మాథ్యూ హేడెన్‌లను చేర్చింది. ఈ గౌరవం మార్చి 22, 2026న చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన 'రోరా'26' ఫ్యాన్ ఈవెంట్‌లో ప్రకటించింది. సీఎస్‌కే ఫ్రాంచైజీ తన లెగసీని గుర్తించడానికి ఈ హాల్ ఆఫ్ ఫేమ్‌ను ప్రారంభించింది. ఇది టీమ్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన, భావోద్వేగపూరితమైన క్షణం అని సీఎస్‌కే అధికారికంగా పేర్కొంది. ఈ ఈవెంట్‌లో మాజీ ప్లేయర్లు, ప్రస్తుత టీమ్ సభ్యులు, ఫ్యాన్స్‌తో కలిసి గత విజయాలను సెలబ్రేట్ చేసుకున్నారు. ఐకాన్ సురేష్ రైనా సీఎస్‌కేతో 2008 నుంచి 2021 వరకు ఆడాడు. టీమ్ ఇన్సెప్షన్ నుంచి అతను స్టార్ ప్లేయర్‌గా నిలిచాడు. నాలుగు ఐపీఎల్ టైటిల్స్ (2010, 2011, 2018, 2021)లో కీలక పాత్ర పోషించాడు. అలాగే 2010, 2014 చాంపియన్స్ లీగ్ టీ20 టైటిల్స్‌లో కూడా భాగస్వామ్యం వహించాడు. 2014 సీఎల్టీ20లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు గెలుచుకున్నాడు (234 రన్స్). సీఎస్‌కే ఫ్యాన్స్ 'చిన్న తల'గా ప్రియంగా పిలుచుకునే రైనా, టీమ్‌కు 5528 రన్స్ సాధించాడు. ఫ్రాంచైజీ అత్యధిక రన్ స్కోరర్లలో ఒకరు.

### మాథ్యూ హేడెన్ -- ఓరెంజ్ క్యాప్ విన్నర్, ఓపెనింగ్ దిగ్గజం

54 ఏళ్ల ఆస్ట్రేలియన్ బ్యాటర్ మాథ్యూ హేడెన్ 2010 ఐపీఎల్ విన్నింగ్ టీమ్‌లో భాగస్వామ్యం వహించాడు. సీఎస్‌కే తరపున ఓపెనర్‌గా భారీ ఇన్నింగ్స్ ఆడి, మొదటి సూపర్ కింగ్స్ ఆరెంజ్ క్యాప్ విన్నర్ అయ్యాడు. అతని అగ్రెస్సివ్ బ్యాటింగ్ సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్‌కు బలం చేకూర్చింది. ఈ ఇద్దరు దిగ్గజాల ఇండక్షన్ సీఎస్‌కే ఫ్యాన్స్‌కు భావోద్వేగపూరితమైన క్షణం. టీమ్ లెగసీని గౌరవించడానికి ఈ హాల్ ఆఫ్ ఫేమ్ ఒక అద్భుతమైన అడుగు అని సీఎస్‌కే అధికారులు చెబుతున్నారు.







# చార్టర్డ్ ఫ్లైట్ కావాల్సిందే..


### విరాట్ కోహ్లీపై చార్టర్డ్ ఫ్లైట్ రూమర్స్ వైరల్

### లండన్--బెంగళూరు ప్రయాణంపై తప్పుడు ప్రచారం

### కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఎమోజీలతో క్లారిటీ..

**ఢిల్లీ:** టీంఇండియా సూపర్ స్టార్ బాట్స్మెన్ "విరాట్ కోహ్లీ" గురించి ఏ విషమైన సరే.. క్షణాల్లో వైరల్ అవుతూనే ఉంటుంది. ఐపీఎల్ 2026 సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో 'విరాట్ కోహ్లీ' సంబంధించి మరోసారి ఓ పెద్ద రూమర్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఐపీఎల్ 2026 సీజన్ లో లండన్--బెంగళూరు మధ్య ప్రయాణానికి చార్టర్డ్ ఫ్లైట్స్ ఆర్సీబీ యాజమాన్యానికి హుకుం జారీ చేసినట్లు కొందరు లేనిపోని వార్తలను సృష్టించారు. అయితే తాజాగా ఈ వార్తలపై కోహ్లీ స్పష్టత ఇచ్చాడు. ఆ పుకారు వార్తలను పూర్తిగా కొట్టిపారేస్తూ.. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రెండు నవ్వుతున్న ఎమోజీలతో చాలా హుందాగా స్పందించాడు. వైరలైన సోషల్ మీడియా పోస్టుల్లో.. ఆర్సీబీ మ్యాచ్ ల మధ్య మూడు రోజుల గ్యాప్ ఉంటే యాజమాన్యాన్నీ చార్టర్డ్ విమానం ఏర్పాటు చేయాలని కోహ్లీ కోరాడని ప్రచారం జరిగింది. ఈ వాదనలన్నీ ఆధారంలేనివని కోహ్లీ రెండు ఎమోజిలతో తేల్చేసాడు. ఈ మధ్యనే లండన్ నుంచి భారత్‌కు తిరిగివచ్చిన కోహ్లీ.. బెంగళూరులో జట్టు ట్రైనింగ్ క్యాంప్‌లో చేరాడు. ఎప్పటి లాగే మరోసారి ఐపీఎల్ లో తన మార్క్ బ్యాటింగ్ చూపించేందుకు కఠినంగా మైదానంలో శ్రమిస్తున్నాడు. మార్చి 28న ఐపీఎల్ 2026 మొదటి మ్యాచ్ గా ఆర్సీబీ సన్ రైజర్స్ హైదరాబాద్ తో తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. కోహ్లీ లండన్ ప్రయాణాలపై చర్చలు కొత్తవి కావు. కోహ్లీ తన కుటుంబంతో కలిసి కొంత సమయం గడపడానికి లండన్ కు వెళ్తూ.. అక్కడ సాధారణ జీవితం గడపడానికి ఇష్టపడతాడు. అయితే ఈ నిర్ణయంపై కొంతమంది విమర్శలు కూడా వ్యక్తం చేసేవారు లేకపోలేదు. దేశానికి చెందిన ప్రముఖ ఆటగాడు విదేశాల్లో ఎక్కువ సమయం గడపడం సరైనదేనా అనే పలు ప్రశ్నలు సోషల్ మీడియాలో ఎప్పుడునుండో వినిపిస్తున్నాయి.







## నటి రోజా
# రీ ఎంట్రీ

### 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే దయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.



# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

### ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి

### గాయని మంగ్లీ ప్రకటన విడుదల

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్గి ÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉ ంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ÷నాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఐఅ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. 'సర్కే చునర్ తేరి సర్కే' పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ? 'ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు' అని తెలిపారు.

# దురంధర్2 కలెక్షన్ల దూకుడు

### ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లు

### తన నటజీవితాన్ని గుర్తు చేసుకున్న గౌరవ

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. దిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. 'ఇది 1998లో మా అమ్మనాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మనాన్నలకు ధన్యవాదాలు' అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. 'ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను. దిల్లీతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చు తగ్గించుకోవడానికి నేను స్నేహితుడితో కలిసి ఓ చిన్న గదిలో ఉంటున్నాను. టెలిఫోన్, విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు భోజనం ఖర్చులు కూడా ఇద్దరం కలిసే పంచుకుంటున్నాం. భవిష్యత్తుపై ఆశతో జీవిస్తున్నాను. కానీ నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది' అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.






# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**